# దొరా! నీ సావు మూడింది!!

**(నరజాతి చరిత్ర)**

**(అనగనగా ఒక రాజు)**

(నాటకం)

యూజీన్ ఓనీల్ వ్రాసిన

## ఎంపరర్ జోన్స్

ఆధారంగా

రచన

మొదలి నాగభూషణ శర్మ

## ఇందులో పాత్రలు

పాటగాళ్ళు

వీరజోదు: అమ్మవారి మీద కథలు చెప్పే కథకుడు

వంత

మరో ముగ్గురు వాద్యకారులు, వంతలు కూడా.

## పాత్రలు

| | |
|---|---|
| ముసలయ్య | కొండజాతి పూజారి |
| షావుకారు | |
| ముసల్ది | కొండజాతికి చెందిన పేదరాలు |
| దొర | ఆ రాజ్యానికి రాజు; అసలు పేరు 'రాజా' |
| ఆకారాలు | దొర ఊహల్లో నిలిచిన అధివాస్తవిక ఆకారాలు |
| జైలర్ | |
| ఖైదీలు | |
| దిష్టి బొమ్మలు | |
| సీత | ఒకప్పటి ప్రియురాలు |
| తల్లి | |
| కొండ నాయకుడు | |
| కొండజాతి ప్రజలు | |

### సూచన

ఇందులో నగారా, డప్పు వంటి ఏ చర్మ వాద్యాన్నయినా వాడవచ్చు.....
దొరను కొండజాతి ప్రజలు వెంటాడడం ప్రారంభించిన తరువాత డప్పు మెల్లగా ప్రారంభమై రానురాను ఉధృతంగా మోగుతుంది....
దొర మన:స్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో, అతని నాడి ఏ స్థాయిలో కొట్టుకుంటుందో ఆ స్థాయిలో యీ వాద్యం మోగించబడాలి –

## పూర్వరంగం

కొండజాతి ప్రజలు ఆనందోత్సాహాలతో కొలుపులు చేసుకుంటున్నారు...అందరూ అమ్మవారి గుడి ముందుకు వచ్చి మొక్కుకుంటున్నారు...ముసలయ్య అందరి మొహాన బొట్టు పెడుతున్నాడు....ఆయనకు పక్కగా వీరజోదు, వంతలు ఉన్నారు..వీరజోదు ఒక చేతిలో కత్తి, రెండో చేతిలో డాలు పట్టుకుని ఉన్నాడు. మొహాన పెద్దబొట్టు, చేతికి గజ్జలు, కాళ్లకు గజ్జెలు..వంతలు: పెద్దడోలు, జముకు, తాళం పట్టుకుని ఉన్నారు....కొలుపులు ముందుగా

వీరంగం, తప్పెట్ల మోత....

**ముసలయ్య**

కూసోండి...కూసోండి అందరూ...అమ్మోరిని కొలిసినం...దయగల అమ్మ...మనల్ని మట్టుబెట్టే రాచ్చసుల్ని, కాలరాసే మహంకాళి...ఆ అమ్మ చల్లంగ చూసింది, మనం మన ఇరోధిని మట్టుబెట్టాం...అందరం అమ్మోరికతని పోవాల....

(కాళి ఆలయం వైపుకు తిరిగి)

దయగల తల్లే! నువ్వే కాపాడాల తల్లీ!
ఇట్టనే కనికరించు మాయమ్మ!
నీ కదలే సెప్పుకుంటాం తల్లీ!

(దణ్ణం పెడతాడు)

కూసోండిరా, అందరూ....ఈరజోదూ! కద మొదలెట్టు – మంచి సొగసుగా ఉండాల అమ్మోరి కత ఇయాల...

(వీరజోదు, వంతలు ముందుకు వస్తారు...వంతలు బాకా ఊదుతారు...శంఖం పూరిస్తారు...పక్క వాద్యాలు ప్రారంభిస్తారు...ఈలోగా వీరజోదు ముసలయ్యతో ఏదో మాట్లాడివస్తాడు.

**వీరజోదు**

(అమ్మవారి ముందుకు వచ్చి) దణ్ణాలు తల్లే! మా చేత నీక్కావలసిన కద చెప్పించుకో మా తల్లే!

**వంతలు**

చెప్పించుకో మా తల్లే!

**వీరజోదు, వంతలు**

(కళ్ళు మూసుకుని, అమ్మవారిని ధ్యానం చేస్తూ)

శరణు శరణు మాయంబారావె
        శంభావో రాణి శంభావో రాణి
కరుణజూడు మాకన్నతల్లి
        దేవి భవాని దేవిభవాని
కాళివచ్చె చూడరమ్మ
        గాలి మేఘాన గాలి మేఘాన
ఓరు మంత ముత్యాల పేరు
        ఒళ్ళంతా మెరయ ఒళ్ళంత మెరయ
ఇంటిట వెలసీనా
        కాళీ మాయమ్మ కాళి మాయమ్మ
కాళినిను తలచేటి

ఘనులెవ్వరమ్మా ఘనులెవ్వరమ్మా

మంచినీ నమ్మేటి

మదుసూ లేనమ్మా మదుసూ లేనమ్మా॥

వీరజోదు

అమ్మోరికి దణ్ణాలు పెట్టి ఆయమ్మ ఆశతో ఓ సరికొత్త కద జెప్పాల యియాల...పిల్లా పెద్దా, ఆడా మగా అందరూ ఇనుకోవలసిన యిసయం జెపుతున్నా...గూడానిక మోసమైన దొరకథ జెప్పుకోవా...మదుసుల గుండెల్ని కోసి, ఒళ్ళంతా గుల్ల చేసి, నరపశువై మనల్ని సంపుకుతింటున్న దొరకదని జెప్పుకోవాల....

వంత

ఎవడయ్యా ఆ నరపశువు?

వీరజోదు

ఆయన పేరు దొర...ఎక్కణ్ణుంచో వచ్చినాదుల్ని మనం అందరం కలిసి దొరని జేసి పెత్తనం యిస్తే మనల్ని దోచుకుతిన్న మహమ్మారి..మంచికి మాయలోడు...ఆయనొచ్చినేల నుంచి కడగళ్ళే జనాలికి...

అమాయకులైన జనం మధ్యకి వచ్చి –

పట్టుపట్టునా పట్టంకట్టాడే దొరగారు॥

కట్టిన కోకా, పెట్టిన ఎండీ

నావేనన్నాడే దొరగారు॥

స్వాహాజేసి స్వారీజేసే

నక్కజిత్తువాడే దొరగారు॥

పట్టిన పట్టు విడవక వాడు

పాణాల్ దీశాడే దొరగారు॥

అబ్బా!

గుండెల్ని కోసి ఒళ్ళంతాదోసి

అడ్డమొచ్చిన వాడి పాణాలుదీసి

రాసిరంపాన బెట్టాడే ॥దొరగారు॥

ఆ యిదంగా ఏకులావచ్చి మేకయిన దొరగారిని గురించిన కదని ఈ రేతిరి జెప్పుకోవాలని అమ్మోరి ఆశ –

షావుకారు

(ఎద్దేవాగా నవ్వుతూ) వీరజోదూ! మీకు ఆ దొరని గురించి ఏం తెలుసుగాని మీ లల్లాయి పదాలేమిటో మీరు పాడుకోండి...

వీరజోదు

ఏమన్నావ్ సావుకారూ!...మళ్ళీ చెప్పు –

షావుకారు

ఏం? మీకా దొర సంగతేం తెలియదూ, మీ అమ్మోరి కదలేందో మీరు జెప్పుకోండి అన్నాను...పిల్లకాకికేం

తెలుసు ఉండేలు దెబ్బా – అని....

**వీరజోదు**

(నవ్వి) ఏమన్నావ్ సావుకారూ! పిల్లకాకి! నిజమే! మేం పిల్లకాకులమే!..అయితే మాత్రం?

పిల్లకాకి దెబ్బతింటే పొడవకుండా మానుతుందా?
ఏడు ఏండ్ల చిన్నవాండ్లు ఇరవయ్యేళ్ళ కోడిగాళ్ళు
ఎనబయేళ్ళ ముసలివాళ్ళు ఇంటావుండె ఆడవాళ్ళు
ఎవ్వడయినా మళ్లి మళ్ళి దెబ్బతింటే వూరుకుంటో? నారాయుడా॥
దెబ్బకొట్టక ఊరుకుంటాడా? నారాయుడా॥
దెబ్బతింటే ఊరుకుంటాడా? నారాయుడా॥

దొరగారనుకున్నాం.....

**వంతలు**

అవును....

**వీరజోదు**

దేవుడనుకుని నెత్తిన బెట్టుకున్నాం...

**వంతలు**

అవును...

**వీరజోదు**

ఇంతజేసిన ఆ దొరగారు మమ్మల్ని జూసిన తీరు, మాకు తెచ్చిన కడగళ్ళు చెప్పుకుందాం అంటే మాకు తెలియదంటావేం సావుకారూ?.....ఏందయ్యా తెలియంది?

ఓ మహిషాసురిడి కద, ఓ ఇరణ్యకశిపుడి కద
ఓ భండాసురుఇడి కద....యీ గొప్పోళ్ళమని
ఇఱ్రయీగిన జనం అంతా సివరి కేమైనారో తెలుసుగంద!

ఓ మంచి అమ్మోరు...ఓ మనసున్న అమ్మోరు...మనుషుల్ని యాటలుగా జేసిన యీ మెకాలనుంచి కాపాడుతూనేవున్నారు!

**షావుకారు**

అదే! అదే! పెద్ద పెద్దమాటలు మాట్లాడుతున్నావ్? నీ అమ్మోరి కధేదో నువ్వు జెప్పుకోక అందరి సంగతీ ఎందుకు?

**వీరజోదు**

మళ్ళీ అదేమాట! సరే సావుకారూ! సత్తెమున్న కదేదో నీ చేతే చెప్పిస్తా, సరా? నిన్న సాయంకాలం నువ్వు దొరతానికి ఒచ్చే తలికి ఏం జరిగిందో ఆణ్ణుంచి మొదలెట్టి కథ నడుపుతాను....ఆ కధలో నువ్వూ వున్నావు గనక, ఒచ్చి నీ కద నువ్వే జెప్పవయ్యా సావుకారూ!

**వంతలు**

చెప్పవయ్యా..చెప్పు (ఆయన్ని అనుకరిస్తూ) అనగనగా ఓ దొర.....

(అనుకరించగా అందరూ నవ్వుతారు)

**షావుకారు**

మీరట్టా జేస్తే బావుండదు తెలుసా?

**వీరజోదు**

మేమేం జేసినాం? మాకేమీ తెలీదంటివి..నీకు తెలుసుగందా, నువ్వు జెప్పగూడదా?

**షావుకారు**

నేను రాను..మీ కత మీరు జెప్పుకోండి –

**వీరజోదు**

అమ్మో! నీకు తెలియదా సావుకారూ?..కథ మొదలెట్టి సాంతం జెప్పకపోతే చెప్పినోళ్ళకి పరబతుండదు; ఇన్నోళ్ళకి ఇసయం తెలియదు..అందుకని, సావుకారూ, నిన్న జరిగింది నీకు తెలుసు, నాకు తెలుసు…నీకు తెలిసింది చెప్పకపోయావో అమ్మోరి మీద ఆన –

(నలుగురు మనుషులు షావుకారిని తెచ్చి వీరజోదుక దగ్గరగా నిలబెడతారు.)

నిన్న పొద్దుకుంకు నేళ …నువ్వు దొరగారింటి కొచ్చావు..అక్కడేం జరిగిందో ఇవరంగా చెప్పవయ్యా… (జనాన్ని ఉద్దేశించి) అయ్యలూ, అమ్మలూ – ఇయాల మీకు యిద్దరు దొంగల కథను చెబుతాను…ఒకాయన (వ్యాపారాయిన్ని చూపి) మా ఒళ్ళంతా గుల్ల చేసినాయన…మరొకాయన గుడినీ, గుళ్ళో లింగాన్ని మింగినాయన–

| | |
|---|---|
| రమరామా రామా రామా | రామో రామా రామా |
| అక్కలారా అన్నలారా | ఆలకించె అయ్యలారా |
| ఇరువురు దొంగల కథను | ఇప్పుడు మీకు చెబుతాను |
| ఒళ్ళంతా గుల్లచేసి | ఇప్పసార తాటికల్లు |
| తాగించే దొంగఒకడు | అమ్మొమ్మో, కాదు కాదు |
| తాగించే దొర ఒకడు | రామో రామా రామా |
| నగలూ, నాణాలు ఒలిసి | ఇల్లంతా గుల్లసేసి |
| ఎందీ అని అడిగి తేను | తలకిందులు కట్టించి |
| కిందిమంట బెట్టించే | దొరగారు మరి ఒకడు ॥రామో రామో రామా॥ |

ఇలాంటి వాళ్ళని ఎనకటి రోజుల్లో అవెమ్మారో, అయెవ్యారో మట్టుబెట్టి జనాన్ని కాపాడేటోళ్ళు……ఇయ్యాలనే… ఆడుసేసిన తప్పుడే ఆడిన ఎంటాడి ఎంటాడి తినేస్తాయిన, పాతవూసులే పగబడతాయనీ చేప్పే –

దొరల కదలు జెప్పాల రామోరామో రామా॥

(ఇద్దరు మనుషులు షావుకారును “పద – కథ జెప్పు” అంటూ నెడతారు…షావుకారు చీకట్లోకి వెడతాడు)

**వీరజోదు**

అమ్మా! నీ ఆనతిని కద జెపుతున్నాం తల్లే! మా బతుకుల కదని నువ్వే జెప్పించాలి తల్లే –

శాంభవీ రావె

అరి వీర భయంకరి ॥శాంభవి॥
అమ్మా! శంభురాణి మా కభయవీయవే
గంభార భైరవీ కరుణజూపవె ॥శాంభవి॥
అమ్మా! చండముండని శుంభ రాక్షసుల
కాలరాచిన కాళజకామ్మవూ ॥శాంభవి॥
అమ్మా! నీ ఆనతి అయితే
వైరి పేగులను తెంచి వేసెదను
వారి తలలతో వసంత మాడెద ॥శాంభవి॥

(పాటపాడుతూ నిష్క్రమిస్తారు)

ఇది పూర్వరంగం

## ఒకటో రంగం

చక్రవర్తి సౌధంలో పెద్దహాలు...ఎత్తు గోడలు..ఒక గోడకు కొరడా..మరో గోడకు కత్తులు, డాలు. ఎడమపక్క ఓ పెద్ద గంట. వెనక భాగంలో ఒక ఆర్చీ..దాని వెనక పెద్ద పెద్ద స్తంభాలు కనిపిస్తాయి. ఇంకా వెనకగా – సుదూరాన – కొండలు, ఆ కొండల అంచుల్ని తాకుతున్నట్టుగా వరసగా కనిపించే తాటిచెట్లు.....వెనక కుడి, ఎడమల రెండు ఆర్చీలు – లోపలికి, బయటకు దార్లుగా. గదిలో ఓ పెద్ద సింహాసనం వంటి కుర్చీ....గదిలో పెద్దగా పరికరాలు లేవు.

సాయంకాలం కావస్తున్నది.

తెరలేచేసరికి ఒక ముసలి కొండజాతి స్త్రీ ఒక మూట బుజాన పెట్టుకుని, మెల్లమెల్లగా అడుగులు వేసుకుంటూ వెనక్కు, వెనక్కు నడుస్తున్నది. హాలు మధ్యన వచ్చి చుట్టూ చూస్తుంది. కుడి వైపునుంచి ఏదో అలికిడి. అప్పుడా మూటను జాగ్రత్తగా గుండెలకు హత్తుకుంది.

ముసలిది వెనక్కు వెనక్కు నడుస్తూ వాకిలి వైపుకు వెడుతూ వుండగా రాఘవులు–షావుకారు – వచ్చాడు..మనిషి విషప్పుచ్చు. మోకాలు దాకాధోవతి. చొక్కా లోపలికి బిగకట్టి పైన బెల్టు పెట్టాడు. దాని మీద కోటు. ఆకు చెప్పులు. చేతులో కర్ర. వస్తుత: పిరికివాడు. కాని అవతలి వాడు భయపడుతున్నాడంటే పౌరుషవంతుడే!

ముసల్ది రాఘవుల్ని చూడదు...తీరా చేసేసరికి షావుకారుకు చాలా దగ్గర్లో – తప్పించుకోవడానికి వీలు లేనంత దగ్గర్లో వుంది...చూడగానే ఓ కేక పెట్టింది. పారిపోబోయింది. రాఘవులు దాన్ని పట్టుకున్నాడు. అది పెనుగులాడుతుంది...

షావుకారు

ఆగవే ముసల్దానా...బుట్టలో పెట్టిన కోడి పెట్టలా గిజగిజా తన్నుకుంటున్నావ్! ఆగసా!

(ముసల్ది మూటను దాచుకుంటుంది)

ఏందే? అది? ఏంది ఆ మూటలో?

ముసల్ది

షావుకారా!...నీకు దణ్ణం పెడతా!...దొరగోరికి చెప్పమాక....

షావుకారు

(నవ్వి) మీ దొ...ర....గా...రి...కి చెప్పొద్దంటున్నావ్! సరే! చెప్పనుగాని, ఏమిటీ దొంగతనం చేసి పారిపోతున్నావా? ఏంటది? పొగాక్కాడా? బుక్కెడు ధాన్యంగింజలా?

ముసల్ది

లేదు సామీ!...నేను దొంగను కాను.

షావుకారు

ఛస్! నాకు జెప్తావేంటే – దొంగలం – నా దగ్గర సాగవే నీ టక్కులు!....పొద్దుటేల నుంచి చూస్తున్నా...అంతా ఏమిటో గత్తరబిత్తరగా ఉంది. ఇక్కడ జూస్తే ఒక్క యదవ నాయాలూ కనిపించదు..అంతా స్మశానం లాగుంది....ఏరే, యీ నాయాళ్ళంతా...

(ముసల్ది మాట్లాడదు)

ఏమే! చెబుతావా, చెప్పవా?

(ముసల్ది మూగగా ఆయనవంక చూసింది. కాని మాట్లాడదు)

(కర్రెఎత్తి) ఇప్పుడు చెప్పవే లం –

ముసల్ది

చెప్తాదొరా! కొట్టకు..మా ఓళ్ళంతా..మా ఓళ్ళంతా –

షావుకారు

ఆ! ఏమయినారు?

ముసల్ది

పోయినారు..కొండమీదికి బోయినారు..

షావుకారు

కొండమీదికా? ఇవి జాతర రోజులు కావుగదే!....నిజమేనంటే?

ముసల్ది

అవును సావుకారా! పెద్దదొర – మా అయ్య –

(అంటూనే నేలమీదికి తలదించి ఆయనకు మొక్కి)

అన్నందిన్నంక నిదరోతడు గంద..అప్పుడంతా గుట్టుసప్పుడు కాకుండా లగెత్తి కెల్లినారు..సంబరాలంట అమ్మోరికి..నేనేమో ముసల్దాన్ని – మద్దేనేల ఎండకి పోలేక బోయినా – ఇప్పుడు బోతున్నా –

షావుకారు

(ముందు ఆశ్చర్యం, ఆ తరువాత ఆనందం) అయితే దొరగారికి తెలియకుండా ఎందుకు పోయారే?

ముసల్ది

(రహస్యంగా) పెద్ద దొరగారికి తెలిస్తే ఎళ్లిపోనీరంట!..ఆడ, మగ అంతా పోయి అమ్మోరికి కానుకలివ్వాలంట!..ఏటపోతు బలి – ఆయెనక సంబరం –

**షావుకారు**

(ఆనందంగా) అదా సంగతి! దొరగారికి తెలియకుండా కొండమీదికి జేరి అమ్మవారికి కానుకలిచ్చి సంబరం చేస్తున్నారంటే, అయ్యగారికి ఉద్వాసనే నన్నమాట! భలే మంచి మాట చెప్పావే, ముసల్దానా! (నవ్వి) దొ...ర...గా...రు

(ముసల్ది మెల్లగా కదుల్తుంది వెళ్ళడానికి)

ఆగు..ఆ మూటేమిటి? (ముసల్ది మాట్లాడదు)

చెబుతావా? లేకుంటే మీ దొరతో చెప్పనా?

**ముసల్ది**

(వణికిపోతూ) ఒద్దు సావుకారా! వద్దు......అమ్మోరికి (రెండు చెంపలూ వేసుకుని) అమ్మోరికి ఎండి కానుకలియ్యారట అందరూ!...ముసల్దాన్ని, నేనేం యియ్యగల్ను? (సిగ్గుతో) ఎప్పుడో మనువునాడు ఓలియిచ్చిండు చెవులకి జూకాలు..అవి అమ్మోరికియ్యాలని పట్టుకుపోతన్న.....

(షావుకారు ఇంకా అనుమానంగా చూస్తాడు)

అమ్మోరి మీద ఒట్టు..కిందటి సంబరాలకి కొన్న కొత్త కోక...చెవి పోగులు..అంతే!

**షావుకారు**

వెండి కానుకలు కావాలటే మీ అమ్మవారికి?

**ముసల్ది**

అమ్మోరు ఎండి గుళ్ళు చేయించమన్నదంట....అందుకు –

**షావుకారు**

సంబరం.....జాతర...వెండిగుళ్ళు (నవ్వి) ఇవ్వాళతో దొరగారి జాతకం వక్రించింది...మన జాతకం తిరిగింది. (నవ్వుకుంటాడు) అన్నట్లు మీ దొరయింట్లోనే వున్నాడా?

**ముసల్ది**

(రహస్యంగా) దొరనిద్దరోతుండు

**షావుకారు**

(పెద్దగా నవ్వుతూ) నిద్రా? ఇది పెద్దనిద్దరకే..!

(ముసల్ది ఒక్క ఉదుటన పరిగెడుతుంది)

(పెద్దగా) ఆగు! అడుగు ముందుకు వేశావా, మీ దొరని లేపుతాను...

(ముసల్ది ఠక్కున ఒణికిపోతుంది. షావుకారు మళ్ళీ పెద్దగా నవ్వుతూ)

పోవే, పో! సంబరానికి సమయమయింది...పో!

(పెద్దగా నవ్వుతూ అది వెళ్ళిన వేపే చూస్తూ వుంటాడు)

(దొర లోపలినుంచి వస్తాడు. ఆజానుబాహువు...మధ్య వయస్కుడు...కళ్ళల్లో తెలివి, జిత్తులమారితనం... మాటలో, చేతలో లెక్కలేనితనం, ప్రతివారినీ అనుమానంగా చూసే నైజం. కటిచుట్టూ రివాల్వర్ గుళ్ళు, రావాల్వర్ మధ్య యుగాల చక్రవర్తుల్ని జ్ఞప్తికి తెస్తాడు క్రౌర్యంలో, అధికారమదంలో)

**దొర**

(కోపంతో) ఎవరు? ఎవరక్కడ? నాకు నిద్రాభంగం చేస్తూ అంత అట్టహాసంగా నవ్విందెవరు? వాడితోలు ఒలిచి చెప్పులు కుట్టిస్తాను.

షావుకారు

(కొంత జంకుతూ, మరికొంత మొండిగా) నేనే..నేనే నవ్వింది...(దొర బొమముడి వేస్తాడు) నీకో శుభవార్త చెబుదామని –

దొర

నువ్వా, షావుకారూ! (కూర్చుంటూ) ఏమిటా శుభవార్త?

షావుకారు

వస్తున్నా...(దగ్గరకు వచ్చి) ఇవ్వాళంతా కొత్తగా కనిపించడం లేదూ?

దొర

కొత్తగానా?...ఏ విషయంలో? (చుట్టూ చూస్తాడు)

షావుకారు

అయితే నేననుకున్నంత తెలివిగలవాడివి కాదన్నమాట!

దొర

(కటువుగా) పొడుపు కథలు మాని, విషయం చెప్పు.

షావుకారు

(వెకిలిగా నవ్వి) వస్తున్నా..వస్తున్నా...మీ బలగం అంతా ఎక్కడ? (వ్యంగ్యంగా) మీ మంత్రులు, సామంతులు, సేనానాయకులు!!

దొర

(ఈ వ్యంగ్యాన్ని పట్టించుకోకుండా) నేను కళ్ళు మూస్తే చాలు వెధవలు, ఏ పక్కనో నక్కి గుక్కెడు ఇప్పసారా సేవిస్తూ వుంటారు..(తాను కూడా వ్యంగ్యంగా) అయినా తమకు వాళ్ళతోనే కదా పని! వాళ్ళు లేందే తమకు గడవదే భృతి?

షావుకారు

నాకు గడవక పోవడమేమిటి?

దొర

వాళ్ళ చేత నువ్వు చేసిన ఇప్పసారా తాగిస్తే గాని నీకు లాభాలుండవు – వాళ్ళు తాగుడుకు మరిగి నువ్వెంత ఇచ్చినా చచ్చేట్టు చాకిరీ చేస్తారు.

షావుకారు

అది...అది...నా వ్యాపారం కనక...

దొర

నువ్వు....నీ వ్యా....పా.....రం (అసహ్యంగా)

షావుకారు

(కోపంతో) ఈ వ్యా.....పా....రం...లోనే ఇక్కడి కొచ్చిన కొత్త రోజుల్లో కూలీగా చేరావు...అప్పుడేమయిందో

దొరగారి ఈసడింపు –

దొర

(చాల భయంకరంగా) షావుకారూ! నోరు సంభాళించుకో!...ఎవరి ముందు మాట్లడుతున్నావో తెలుసా?..ఈ కొండదొర – ఈ చక్రవర్తి ముందు కుప్పిగంతులు వెయ్యకు..ఇక్కడ నా మాటకు ఎదురు చెప్పినా, నా చేతలకు ఎదురు తిరిగినా ఏం జరుగుతుందో తెలుసుగా?

(రివాల్వర్ మీదకు పోయింది చెయ్యి..షావుకారుకు కోపమూ వచ్చింది; భయమూ వేసింది)

షావుకారు

పాతనేస్తానికి...ఏదో సరదాకి అన్నాను..అంతే!

దొర

అది క్షమాపణే అయితే, దాన్ని మేం ఆమోదిస్తున్నాం...రాఘవులూ! పాత విషయాలు జ్ఞాపకం చెయ్యకు..పని కోసం నీ దగ్గరకు వచ్చిన రాజా, ఈ కొండ దొర ఒకళ్ళు కాదు. చూడు. నా చేత పని చేయించుకున్నది నీ వ్యాపారం కోసం, నా మీద జాలితో కాదు. నీ అవసరం కనక....

షావుకారు

నేను కాదన్నానా? అయితే నువ్వు జైలు నుంచి పారిపోయివచ్చావని ఎవ్వరూ పని ఇవ్వకపోతే, నీకు పని ఇచ్చింది నేను కాదూ?

దొర

ఆ మిషమీద నన్ను చిన్న చూపు చూడకు..(నవ్వి) ఆ మాటకొస్తే నువ్వు మాత్రం జైలుకు వెళ్ళిరాలా?

షావుకారు

అబద్ధం...ఈ కట్టుకథ ఎవరు చెప్పారు నీకు?

దొర

(పెద్దగా నవ్వి) ఎవరూ చెప్పకుండానే మనుషుల కళ్ళలోకి చూసి వాళ్ళను సమస్తమూ తెలుసుకోగల ప్రజ్ఞ నాకు వుంది. (క్షణం ఆగి) నిజమే! ఈ కోయజాతి జనం మధ్యకు నా వ్యాపారం పేరుతోనే నన్ను పంపించావు..నిజం...(సాలోచనగా) ఆ తరువాత నాకు రెండేళ్ళ కన్న ఎక్కువ కాలం పట్టలేదు యీ మూర్ఖుల్ని నా బానిసలుగా చేసుకోవడానికి. పనిమనిషిగా చేరాను. నిజమే...ఇవ్వాళ..దొరని..చక్రవర్తిని..ఏమంటావ్.

షావుకారు

అవును...చక్రవర్తివైనావు...అధికారం చేజిక్కించుకున్నావు..కాదన్న వాళ్ళని చంపించావు; అనుమానించిన వాళ్ళని దువ్వావు – నీ అధికారం నిలబెట్టుకోవడానికి.

దొర

అధికారం!...(వ్యంగ్యంగా నవ్వి) అధికారం చెలాయించడం కోసమే – ఇక్కడ! ఈ అరణ్యంలో – నాగరికత ఎరగని మృగాల మధ్య – యిన్నాళ్ళు ఉన్నానంటావ్! (నవ్వుతాడు)

షావుకారు

మరి?

దొర

ఈ ఎడారి అడవిలో అధికారం ఎవరికి కావాలి? ధనమయ్యా ధనం...అదీ మనం యిక్కడ చేజిక్కించుకోవలసింది...చూడు సావుకారూ! నువ్వు చిన్న వ్యాపారివి. నీకు రోజూ లాభాలు ముఖ్యం. నేను అలా కాదు. వర్తమానాన్ని కుదువ బెట్టి భవిష్యత్తును కొంటాను. ఇప్పటికే సగం డబ్బు విదేశీ బాంకుల్లో దాచాను. మిగిలిన డబ్బు, బంగారం, నగలు – అవన్నీ యిక్కడే దాచిపెట్టాను.

షావుకారు

(ఉత్సుకతతో) ఎక్కడ?

దొర

(పెద్దగా నవ్వి) నేను అంత వెర్రివాణ్ణనుకున్నావా? ఇక్కడనుంచి వెళ్ళేటప్పుడు – అత్యవసంగా వాడుకోవడానికి ఆ డబ్బును దాచిపెట్టాను..ఎప్పుడో ఒకప్పుడు ఇక్కడి సార్వభౌమత్వానికి స్వస్తి చెప్పి, ఏ నాగరిక దేశానికో పోయి సర్వసౌఖ్యాలూ అనుభవించాలి...ఇహ యీ వెర్రి వెధవలంటావ్! వాళ్ళకో దొర కావాలి. వాళ్ళ దొర నాతో తలపడి పొరపాటున చచ్చిపోయాడు. అమ్మ అశీర్వాదంతో తప్ప నేనా పని చెయ్యలేనని నమ్మి, వాళ్ళు నాకు పట్టం కట్టారు. నన్ను దొర అన్నారు. దాసోహం అన్నారు. వాళ్ళకి రాజు కావాలి; నాకు డబ్బు కావాలి. ఎలా వుంది పథకం?

షావుకారు

పథకానికేం? బ్రహ్మాండంగా ఉంది. నువ్వయింత  సంపాదించుకున్నావ్! నన్నుమాత్రం –

దొర

చూడు షావుకారూ! నిన్ను ఇక్కడ వ్యాపారం చేయనిస్తున్నాను, సంతోషించు. నా ప్రజల్ని దోచుకుంటున్నా, కలప చాటుగా అమ్ముకుంటున్నా, ఇప్పసారాలో తాటికల్లు కలిపి దొంగచాటుగా బయట అమ్ముకున్నా నిన్నేమీ అనలేదు..నా ప్రజల్ని దోస్తున్నా –

షావుకారు

నేను దోస్తున్నదేముంది, చిన్నమో చితకో! మరి దొరవారూ? పన్నులు పన్నులంటూ ఇక్కడి అందర్నీ చికారుల్ని చేశారు. చివరకు అమ్మవారి జాతరకు కూడా పన్ను కట్టక తప్పలేదు గదా వీళ్ళకి?

దొర

అదే రాజుకీ వ్యాపారికీ ఉన్న తేడా? వ్యాపారి లాభం సంపాదించాలంటే సరుకంటూ చూపించాలి. ప్రభువులకి అవేమీ అక్కర్లేదు..నువ్వు చిన్న దోపిడీ దారుడివి. పట్టుకుంటే జైల్లో వేస్తారు..నన్ను! (నవ్వి) పట్టుకుంటే చక్రవర్తిని చేస్తారు..బయటి ప్రపంచంలో నేనిన్నాళ్ళు నేర్చుకున్నది యిదే!

షావుకారు

నీ తెగింపుకు అదృష్టం కూడా కలిసి వచ్చిందిలే!

దొర

అదృష్టమా?..అదేమిటి?

షావుకారు

నిన్ను చంపబోయిన కొండదొరని నువ్వే మట్టుపెట్టావ్! నీ మీద పగతీర్చుకోవడానికి వచ్చిన వాళ్ళకి నువ్వు వెండి గుండుతో కాని చావనన్నావ్! అది అమ్మవారి వరం అన్నావ్! ఆ ఎదవ నాయాళ్ళు నమ్మారు. నీ

గొప్పలకి ఆ అమాయకులు నమ్మడం, నీకు పూజలూ, మొక్కుబడులూ చెయ్యడం –

దొర

గొప్పలా?..లేదే! నేను  నిజమే చెప్పాను.

షావుకారు

అంటే – నిజంగా వెండి గుండు ఉన్నదంటావా?

దొర

ఆశ్చర్యంగా ఉందా?..చూడు!..(రివాల్వర్ తీసి చూపుతూ) ఈ అయిదూ సీసం గుళ్ళు......ఇదుగో! ఇది వెండి గుండు!

షావుకారు

ఇదంతా వెండే!..ఏదీ, చూడనీ! (పట్టుకోబోతాడు)

దొర

(ఒక అడుగు దూరంగా జరిగి) షావుకారూ! జాగ్రత్త!

షావుకారు

రామరామ! నేను నీకంటికి దొంగలా కనిపిస్తున్నానా?

దొర

నీ జిత్తులు నా దగ్గర కాదు...దీన్ని మరో ప్రాణి ముట్టుకోవడానికి వీలులేదు...(దాన్ని ముద్దు పెట్టుకుంటూ) ఇది నా ప్రాణ ప్రదమైన ఆయుధం...నా పరమశత్రువుని మట్టుపెట్టే ఆయుధం!!

షావుకారు

అట్లాగా! అయితే అది ఉపయోగించాల్సిన సమయం వచ్చేసినట్టే!

దొర

ఇది జోస్యమా, లేకపోతే నీ కోరికా? అయినా నాకు తెలుసు..యీ దొరపదవి శాశ్వతం కాదని...శాశ్వతమయితే మాత్రం దాని కోసం నేనిక్కడ ఉండిపోతాననుకున్నావా? అవతలి ప్రపంచంలో నా కోసం సర్వసుఖాలు, భోగభాగ్యాలు కాచుక్కూర్చుంటే –

షావుకారు

అదేమిటి? మళ్ళీ మీ దేశం వెడతావా. అక్కడ నీ పాత జీవితం సంగతి –

దొర

పాత జీవితం పేరు చెప్పి నన్ను భయపెట్టకు...జైలు నుంచి పారిపోయి వచ్చాననేగా? హు...ఇంకా దాని వెనక చాలా కథ ఉంది..

షావుకారు

నేనెందుకు భయపెడతాను? నేనెప్పుడూ నీ మేలు కోరేవాడినే! ఇప్పుడు చూడు..ఆ మాట రుజువు చేస్తాను..ఇందాక నీకో శుభవార్త చెబుతానన్నానే! ఇప్పుడు చెబుతాను –

దొర

నువ్వు అంత సంతోషంగా ఉన్నావంటే అది నాకు చాలా ప్రమాదకరమైన వార్తే అయివుండాలి..ఏమిటో

చెప్పు.

షావుకారు

నీ వెండిగుండును ఉపయోగించాల్సి సమయం వచ్చింది!

దొర

సంగతేమిటో సరిగ్గా చెప్పు.

షావుకారు

వస్తున్నా..చూడు! నీ భటులు, పరిచారకులూ ఒక్కరూ కనిపించరేం?

దొర

చెప్పానుగా! ఎక్కడో తాగి తందనాలాడుతుంటారు.

షావుకారు

అయితే వాళ్ళను పిలు..నీకే తెలుస్తుంది.

దొర

ఏమిటి నువ్వనేది?

(మూడుసార్లు చప్పట్లు చరుస్తాడు...ఎవ్వరూ పలకరు..ఒక్క ఉదటున సింహాసనం మీద నుంచి లేస్తాడు. వెళ్ళి గంటను కొడతాడు..మళ్ళీ నిశ్శబ్దం..ఈ సాది గంటను గట్టిగా మోగిస్తాడు..అలికిడి లేదు...ద్వారాల దగ్గరకు వెళ్ళిచూస్తాడు)

షావుకారు

(వ్యంగ్యంగా) చక్రవర్తిగారూ! ప్రజ్ఞావంతులు..చతురులు..మేధాసంపన్నులు..ఇవ్వాళతో మీ ఆటకట్టు!!

దొర

(ముందు నిర్ఘాంతపోయాడు. ఇంతలో తేరుకుని పెద్దగా నవ్వుతాడు) షావుకారూ! నీకేం చెప్పాను? ఈ చక్రవర్తి పదవి శాశ్వతం కాదన్నాను. దీన్ని అంటిపెట్టుకుని ఇక్కడే ఉండనన్నాను. అవునా? ఆ పని యిప్పుడే చేస్తున్నాను. ఈ క్షణమే నేను నా పదవిని త్యజిస్తున్నాను.

షావుకారు

(నిర్ఘాంతపోయాడు) ఏమిటీ!

దొర

(నవ్వి) ఈ వేషం ఇంతటితో ముగిసింది. దీని సిగ్గోసిరి! ఇటు వంటివి, ఇంతకన్న మంచివి – సవాలక్ష!! మన చేతుల్లోంచి పోతున్నదని తెలిసి దాన్ని పట్టుకునే వేళ్ళాడే వాడు దద్దమ్మ...(ఎక్కడనుంచో మెల్లగా శబ్దం వినవస్తుంది. దాన్ని జాగ్రత్తగా వింటాడు) అయితే వీళ్ళంతా కొండమీద అమ్మవారి గుడినుంచి బయలు దేరారన్నమాట!

షావుకారు

(ఆశ్చర్యపోయి) నీకెలా తెలుసు?

దొర

ఈ కొండల్లో కోనల్లో ఎక్కడ ఏ శబ్దం అయినా నాకు ఇట్టే తెలుస్తుంది –

షావుకారు

అవును. లేవగలిగిన ప్రతిప్రాణీ అక్కడే వుంది.....(వ్యంగ్యంగా) అమ్మ వారికి సంబరాల్ట!

దొర

(మళ్ళీ శబ్దం విని) అదుగో డప్పుల మోత!..కాని వేళలో సంబరాలంటే ప్రమాదం పైపై కొస్తోందన్నమాట! వాళ్ళు యిక్కడకి వచ్చేసరికి మనం మూటాముల్లే సర్దుకోవాలన్నమాట!

షావుకారు

అది అంత తేలిక కాదు..ఈ అడవి గురించి నీకు తెలియదు. ఈ కొండ వెధవలకి తప్ప ఇక్కడి దోవలు ఎవ్వరికీ అంతుపట్టవు. అదీ గాక, ఏరుదాటాలంటే పగలే గాని, రాత్రి దాటడం బ్రహ్మతరం గాదు.

దొర

అంతేనా నన్ను గురించి తెలిసింది. వాళ్ళు కొండ దిగి వచ్చే సరికి నేను ఏరు దాటుతూ వుంటాను. నా డబ్బు, బంగారం, నగలూ – అన్నింటితో సహా. చాపలా దూసుకుపోయే మరబోటు ఎవ్వరికి తెలియని చోట కట్టివుంచాను. పోలు మీద ఉన్నా 'రై' మని పోయే బోటు. అది మరో గంటలో నన్ను అవతలి ఒడ్డుకు చేరుస్తుంది.

షావుకారు

నువ్వు వెడుతున్నట్టు తెలిస్తే వాళ్ళనాయకుడు ఊరుకుంటాడా ఏం? వాడికి తెలిసిందంటే –

దొర

వాడి తరంగాదు..ఇది వరకు వాడు నా చేతిలో ఎన్ని కొరడా దెబ్బలు తినలేదు? ఆ శిక్షచాలక పోతే వాడి ప్రాణాలు తీస్తాను. అయిదుగుళ్ళు మామూలు వెధవల కోసం..వెండి గుండు మాత్రం ఆ వెధవ కోసం –

(చప్పుడు – కొలుపులకు బయలుదేరే చప్పుడు)

అమ్మోరి కొలుపులు.....

షావుకారు

ఆ! నిన్ను కడదేర్చడానికి చేస్తున్న అమ్మోరి సంబరాలు –

దొర

(నిర్లక్ష్యంగా) చేసుకోనీ – ఇటువంటి ఒట్టి అరుపులు నన్నేం చేయలేవు.

షావుకారు

అమ్మో! అలా అనకు...ఈ అమ్మోరు చాలా గుణం గల అమ్మ..సంబరం రాత్రి ఈ అడవిలో ప్రతి చెట్టు, పుట్టా కూడా అమ్మవారి భషల్లో నిండి వుంటుందిట!

దొర

(నవ్వి) షావుకారూ! నీ మాదిరిగా నేను పేదగుండె వాణ్ని కాదు..

షావుకారు

నిజంగా! నేనూ చూశా...ఈ రాత్రి ఆభటులంతా వింత వింత రూపాల్తో దయ్యాల్లా, భూతాల్లా కనిపిస్తార్ట!

దొర

షావుకారూ! ఈ కబుర్లు నా దగ్గర చెప్పకు…ఒట్టి పిరికి గుండె వాడివి….పైగా నా దగ్గర వెండి గుండు ఉందని మరిచిపోకు – ఇంకా నీతో వాదిస్తూ కూర్చునే సమయం లేదు…నేను వెంటనే బయలు దేరాలి..

(పైన ఉన్న చక్రవర్తి వస్త్రాలను సింహాసనం మీద పడేస్తాడు)

షావుకారు

దోవలో ఎవరన్నా నీ పాత స్నేహితులు కలిస్తే నేనడిగానని చెప్పు.

దొర

అంతేనా? నేరుగా నీ దగ్గరకే పంపిస్తాను..నీ వంటి దగుల్బాజీ యీ ప్రపంచంలో లేడని చెప్పి మరీ పంపిస్తాను..(షావుకారు నవ్వుతాడు) సరే! వస్తా! వీళ్ళ నాయకుడు వస్తే యీ సంగతి చెప్పు – (బయలుదేరుతాడు)

షావుకారు

అదేమిటి? సామనేం తీసుకుపోవూ?

దొర

వచ్చేటప్పుడు తేలిగ్గా వచ్చాను. వెళ్ళేటప్పుడు కూడా అంతే! పైగా – దోవలో తీసుకువెళ్ళవలసినవి చాలా వున్నాయి. రెండు గంటల్లో వాటితో సహా నా బోలులో ఉంటాను. ఆ తరువాత మరో గంటలో – మరో ప్రపంచంలో …..వస్తాను…

(అంటూ ముఖ ద్వారం వైపుకు వెడతాడు)

షావుకారు

అదేమిటి, ఆ వైపుకు వెడుతున్నావు? వాళ్ళు అటేవస్తారు!

దొర

నేను ఈ రాజ్యానికి చక్రవర్తిని! దొడ్డిదారిన పొమ్మంటావా? ఆ డప్పుల మోత విన్నావా? పాపం! ధైర్యం కూడగట్టుకోవడానికి బానిస వెధవలు పడుతున్న శ్రమ! అదే నాకు వీడ్కోలు (వెళ్ళిపోతాడు)

షావుకారు

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. గొప్పలు చెప్పుకున్నా వెధవకి గుండె ధైర్యం ఎక్కువ!.వాళ్ళంతా వచ్చేలోగా మన పని మనం చేసుకుంటే పోలా? (లోపలికి వెడతాడు)

(మెల్లగా లైట్లు ఆగి, మళ్ళీ వెలుగుతాయి. షావుకారు ఓ మూటతో యింట్లోనుంచి వెనక్కు వెనక్కు నడుస్తూ వస్తాడు…నలుగురు కొండజాతి వాళ్ళు అతి మెల్లగా వచ్చి షావుకారును పట్టుకుంటారు. షావుకారు విడిపించుకోవాలని చూస్తాడు)

ముసలయ్య

ఆగమయ్యా షావుకారూ! బుట్టలో పెట్టిన కోడిపెట్టలా గిజగిజతన్నుకుంటున్నావు! ఆగసా! ఏందది? ఏందా మూటలో?

షావుకారు

ఏంలేదు ముసలయ్యా!..ఏదో..

మునలయ్య

ఏందో సూడనీ రాదూ?

షావుకారు

నీకు పుణ్యముంటుంది..మీ నాయకుడితో చెప్పకు...

మునలయ్య

ఏందీ! మీ నాయకుడికి చెప్పొద్దంటావ్! (అని మూటగుంజుకుని చూస్తాడు)

ఆ! ఎండి నగలు! దొంగతనం సేసి పారిపోతున్నావన్నమాట!

షావుకారు

లేదు లేదు..ఏదో, దొరగారు --

మునలయ్య

ఎక్కడ్నయ్యా మీ దొరగారూ?

షావుకారు

లేదు...ఎప్పుడో పారిపోయాడు..

మునలయ్య

పారపోయాడా? ఒరేయ్....వెతకండిరా -

(జనం వెడతారు)

షావుకారు

నిజంగా ముసలయ్యా! మీ నగారా విన్నప్పుడే పారిపోయాడు...

జనం

(వెతికి) లేదు ముసలయ్యా! లోనలేదు

లేదు ముసలయ్యా! లోనలేదు దొర

షావుకారు

సరేనా! ఇహ నన్ను ఒదిలి పెట్టండి..నా మానాన నేను పోతాను.

మునలయ్య

అమ్మో! నీతో సానా పనుంది!..నువ్వు పక్కనుండి మాకు దొర సమాచారం అంతా చెప్పాలా..ఈ నగలన్నీ అమ్మోరికి కానుకలివ్వాల...పదండిరా తొందరగా పదండి....దొర పారిపోయిందని నాయకుడికి చెప్పాలా...పదయ్యా సావుకారూ!

(షావుకారు రానని గింజుకుంటాడు)

మునలయ్య

ఒరే! మంచిగా చెబితే రాదుగాని - మోసెయ్యండిరా ఆయన్ని - మన నాయకుడి కాడికి -

(నలుగురు షావుకారును మోసుకుంటూ వెడతారు..)

(తెర)

## రెండో రంగం

(దొర రొప్పుతూ వస్తాడు..కాళ్ళీడ్చుకుంటూ)

(దూరంగా డప్పుడట చప్పుడు)

**దొర**

అమ్మయ్య! చివరికి తేరుకున్నాను. అబ్బ! అప్పుడే చీకటి పడ్డది. మానులన్నీ పెనుభూతాల్లా కనిపిస్తున్నాయి..ఈ కారడవి లోనుంచి తొందరగా బయట పడాలి. (కాళ్ళు ఒత్తుకుంటూ) అబ్బ! ఎంతదూరం పరిగెత్తాను! రెండేళ్ళు చక్రవర్తినై కాళ్ళను పనిచెప్పడమే లేదు. (కాళ్ళతో) ఒసే! రెండేళ్ళకే అంత మొరాయిస్తే ఎలా? మనకి యింకా చాలా ప్రయాణం వుంది, ముందు –

(చప్పుళ్ళు కొంచెం దగ్గరగా వచ్చాయి)

అదుగో! వాళ్ళ సంబరం యిటే వస్తున్నట్టుగా ఉంది. నా కోసమే కాబోలు వాళ్ళ వేట!..వెధవలు! వాళ్ళిక్కడికి చేరుకునే లోగా నేను ఈ గుట్టలకీ, దాని పక్కనున్న నదికీ – అన్నిటికీ అవతల – మరో దేశంలో!!

(ఒళ్ళు విరుచుకుని)

ఇహ తొందరగా తెమలాలి.

ఎందుకబ్బా లేవబుద్ది కావడం లేదు? ఆ! ఒరే దొరా! నాకు ఆకలేస్తుందిరా! పొద్దున్న భోజనం, మధ్యాహ్నం ఫలహారం, రాత్రికి భోజనం – ఇట్లా అలవాటు చేసుకున్నావ్! మనషి అలవాట్లకు బానిస – అని వూరికే  అన్నారా?

కాని ఆకలికోసం ఆగడం కుదరదు..ముందు నగల సంగతి చూడాలి..(తాను పాతిపెట్టిన చోటును ఉజ్జాయింపుగా కొలుచుకుని తవ్వడం మొదలెడతాడు, బాకుతో)

(అక్కడ ఏమీ కనపడవు....నిర్విణ్ణుడయి)

అరె! దోవతప్పానా! లేదే! ఇక్కడే – యీ చదునైన చోట – నాలుగు చెట్లు నలుచదరంగా – అందులో ఎడమనుంచి రెండో చెట్టు పక్కనే!..లేదు లేదు. దోవ తప్పడం అసంభవం..కటిక చీకటిలో ఇది వరకు ఎన్నిసార్లు రాలేదు? ఓహ్! నాతల తిరుగుతోంది. రెండు సంవత్సరాలు నిద్రాహారాలు లేకుండా సంపాదించిన బంగారం! ఇక్కడ జనాన్ని భయపెట్టి, వేధించి గడించిన నగలు!..(నిట్టూర్చి) నా ఆశలన్నీ నడియాసలౌతాయా? మిగిలిన జీవితమంతా కాలుమీద కాలు వేసుకుని హాయిగా బతకొచ్చనుకున్నాను. ప్రపంచలో కోరుకోదగ్గ సుఖాలన్నీ నావేనని కలలు కన్నాను. నగలు, బంగారం సంపాదించడానికి జనాన్ని పురుగుల్లా వేటాడాను, చంపాను..

(2 మగ ఆకారాలు, 1 ఆడ ఆకారం...రెండుసార్లు పెద్దగా నవ్వుతాయి)

ఎవరది? ఎవరు? మాట్లాడరేం?

(మళ్ళీ రెండుసార్లు నవ్వు)

ఎవరు? ఎవరు మీరు?

**3ఆకారాలు కలిసి**

పురుగులం..మిణుగురు పురుగులం..నీ డబ్బు అనే ఆకలిమంటలో మాడిపోయిన పురుగులం..మమ్మల్ని చంపి మా నగలు, బంగారం అంతా దోచుకున్నావు! జ్ఞాపకం లేదు?

దొర

లేదు...నేను చంపలేదు..నాకు తెలియదు..మీరెవరో నాకు తెలియదు..మిమ్మల్ని ఎవరు చంపారో నాకు తెలియదు.

ఆకారాలు

(నవ్వుతూ) తెలియదూ?......తెలియదూ?

ఆడఆకారం

నన్ను సలసల కాగే నూనెలో వేసి చంపావ్! జ్ఞాపకం లేదూ?

మగాఆకారం

నన్ను బల్లాలతో తూట్లు పొడిపించావ్! జ్ఞాపకం లేదూ?

మరో మగాఆకారం

నన్ను బెట్టుకొమ్మలకు కట్టించి కొరడాతో కొట్టించావు..జ్ఞాపకంలేదా?

మూడు ఆకారాలు

తెలియదూ? (నవ్వి) ఇదుగో నీ బంగారం! మా దగ్గర ఉందిగా! తీసుకో....తీసుకో.....(దొరమీదకు వస్తాయి)

దొర

ఆగండి...ముందుకు వచ్చారా.......జాగ్రత్త

(3 ఆకారాలు నవ్వుతూ మీదమీదకు రాబోతాయి......దొర పిస్తోలుతో పేలుస్తాడు..ఆకారాలు మాయమవుతాయి. శబ్దం, పొగ..)

దొర

మీరా నన్ను భయపెట్టేవాళ్ళు! (రివాల్వర్ లోపల పెట్టుకుని) షావుకారు చెప్పింది నిజమే నని పిస్తోంది. పొద్దుకూకే సరికి యీ అడవి భూతగృహంలా కనిపిస్తోంది. పోనీలే! ఈ దెబ్బతో దయ్యం వదిలింది... నన్ను భయపెడదామనుకున్నాయి!

అయినా ఎప్పుడో చచ్చిన కొండజాతి వెధవలు ఇప్పుడు నన్నెందుకు భయపెడుతున్నారు? ఆ! ఇదంతా ఒట్టి భ్రమ......ఛా! ఇటువంటి వాటికా చక్రవర్తి భయపడ్డం?

(డప్పుల మోత మరికొంత దగ్గరగా)

అదుగో! ఆ దొంగనాయాళ్ళు వచ్చేస్తున్నారు! లాభం లేదు..నగల కోసం వెదకండం వృథాప్రయాస! తొందరగా ఈ అడవి నుంచి తప్పించుకొని బయటపడాలి...

(లైట్లు కొంచెంగా డిమ్ మళ్ళీ వస్తాయి)

## మూడోరంగం

(మరోపక్కనుంచి కొలుపుల జనం వస్తారు...వీరజోదు, వంతలు, ముసలయ్య, కొండజాతి ప్రజలు, నాయకుడు – అందరూ దొరని వెతుక్కుంటూ వస్తారు)

ఒకడు

అమ్మా! ఆ దొర ఎక్కడున్నాడో ఎరిక చెయ్యి తల్లీ!!

ముసలయ్య

ఒరే! ఆ మద్దెమాను పక్కన వెదకండిరా!...

అందరూ

అమ్మా!.....తల్లీ.......రచ్చించు మాయమ్మ......

(అంటూ వెళ్ళిపోతారు)

## నాలుగో రంగం

(దూరంగా తప్పెట్ల మోత....మరికొంచెం వేగంగా)

(దొర నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ వస్తాడు)

దొర

లాభంలేదు. పరిగెత్తి పరిగెత్తీ కాళ్ళు నొప్పులు పుడుతున్నాయి. నేలను తవ్వి తవ్వీ చేతులు మంట పుడుతున్నాయి. నేను పెట్టిన చోట నగలూ లేవు..ఆహారంతో నిలవ చేసిన ముంతలూ లేవు...(నిట్టూర్చి) ముత్యాలు లేవు సరే, అవి చిప్పలు కూడా లేవా?

ఒరే చక్రవర్తీ! నువ్వు మళ్ళీ వెనకటి బతుకులోకే వెళ్ళిపోతున్నావురా! ఏమయినా నీ కలలన్నీ?..బంగారు కలలు! ముత్యాల పల్లకీలు...అందాల భరిణలు..హు! అన్నీ చెదిరిపోయాయి..చెరిగిపోయాయి.....

కాదు....కానివ్వను..ఎలాగైనా సరే వాటిని చేజిక్కించుకొని కాని ఇక్కణ్ణుంచి పోను..పోను...(దీనంగా) పోలేను..

ఎంత పొద్దు పోయింది! ఇంత రాత్రి! ఎంత దూరం – ఎంత సేపు పరిగెత్తను? (నవ్వుకుని) చక్రవర్తి!..చక్రవర్తి పలాయనం! ఇంకా ఇక్కడ ఆగకూడదు.. కనీసం ఇక్కణ్ణుంచి బయటపడితే చాలు..ఇంకా బాంకుల్లో లక్షలున్నాయి...హాయిగా, నిశ్చింతగా బతకొచ్చు. నీకేం రా? మరో రాజ్యానికి చక్రవర్తివి కావచ్చు..పోయిన దానికి విచార పడడం పిరికివాడి లక్షణం. వెనక్కి చూడకు..ముందుకు సాగిపో – (కర్రతో నేల మీద కొట్టిన చప్పుడు)

ఎవరది? ఎవరు..ఎవరు? మాట్లాడరేం. బయటకు రండి..

(జైలర్ – అతనితో పాటు 4గురు ఖైదీలు వస్తారు)

జైలర్

అరే 209! నువ్వక్కడంఏ చేస్తున్నావ్? రా! లైనులో నిలబడు..(రాజా కాళ్ళమీద కొడతాడు కర్రతో)

దొర

జైలర్!...నువ్వా?

జైలర్

ఊ..(ఖైదీల పక్కన నిలబడమని సంజ్ఞ చేస్తాడు) సరిగ్గా నిలబడండి...నీకే చెబుతున్నది. ఏమిటా ధీమా?

(అని కర్రతో మళ్ళీ బుజం మీద కొడతాడు)

దొర

అబ్బా!

జైలర్

ఏరా? వెనగ్గా వచ్చి వెన్నుపోటు పొడవడమనుకున్నావా? పాపం కదా అని దొంగచాటుగా నీకు అన్నం పెడుతూ, వీళ్ళందరి చేతా తిట్లు తిన్నందుకు ఫలితం – (కొడుతూ) తిన్నయింటి వాసాలు లెక్కపెడతావురా?

దొర

జైలర్..నిన్ను..నిన్ను చంపాననుకున్నావ్! నేను జైలునుంచి పారపోతూ వుండగా పట్టుకున్నావు కదూ! అప్పుడు – నీ గొంతుపిసికి –

జైలర్

(పెద్దగా నవ్వుతూ) అవున్రా! నువ్వు ఎవర్నో ప్రేమించావని, దాని మొగుడ్నుంచి దాన్ని తప్పించుకు తీసుకుపోతే ఆ మొగుడు జైల్లో వేయించాడని అంటే జాలిపడ్డాను. ప్రేమించేవాడు కసాయివాడు కాదు అనుకున్నాను. కనికరించాను. జైల్లో ఎవరికీ లేని సౌకర్యాలు కలిపించాను. అది ఆసరాగా తీసుకుని నా ఉద్యోగానికే ఎసరు పెడితే పట్టుకోనూ?

దొర

అవును!..అప్పుడే నువ్వు వెనకనుంచి వచ్చి పట్టుకున్నావ్! ఇక దొరికిపోయాననుకున్నాను..అప్పుడు నీ గొంతు పిసికి...నీ గొంతు పిసికి – నిన్ను చంపాను.

జైలర్

అప్పుడు నన్ను చంపావు కదూ! ఇప్పుడు నేను నిన్ను చంపుతాను...రా.......

దొర

రాకు...నాకు దగ్గరగా రాకు..జైలర్..నీకు నా సంగతి తెలుసు..

జైలర్

ఒరేయ్ 209!......కాదు కాదు– రాజా కదూ నీ పేరు – ఒరే రాజా! నా చేతుల్లో ఉందిరా నీ చావు –

దొర

దగ్గరకు రాకు....జైలర్! ఇప్పుడు నిన్ను చంపుతాను...ఇదుగో – ఈ గుండుతో నీ చావు తప్పదు...

(పిస్తోలు శబ్దం..పొగ..లైట్లు ఆరి వెలుగుతాయి)

ఈ దొరకు ఎదురునిలిచి ఎవ్వడూ బతకలేదని గుర్తుంచుకో!

(డప్పుల చప్పుడు...పాట)

దొర

ఆ దొంగవెధవలు యిటే వస్తున్నారు! తొందరగా కూడా వస్తున్నట్టున్నారు! దీనికి తోడు నా పిస్తోలు శబ్దం కూడా వినిపించిదేమో! నగలూ, నాణ్యాలు వద్దు. తిండీ తిప్పలూ వద్దు...ఇక్కడనుంచి వెంటనే పారిపోవాలి...బతికుంటే బలుసాకు తినొచ్చు..(నవ్వుకుని) బలుసాకేం ఖర్మ! పంచ భక్ష్య పరమాణ్ణాలే తినొచ్చు. పరిగెత్తాలి..ఆ వెధవలకి అందకుండా..ఏటి గట్టుకు చేరితే ఒడ్డున పడ్డట్టే!

చక్రవర్తీ!..కాదు కాదు....దొరా....అబ్బే!

అదీ కాదు...రాజా – పరిగెత్తు.....

(త్వరగా వెళ్ళిపోతాడు)

## అయిదో రంగం

(దొర వెళ్ళిన కొద్దిక్షణాల్లోనే ముసలయ్య, వీరజోదు, వంతలు, కొండజాతి జనం, వాళ్ళ నాయకుడు, షావుకారు వస్తారు... వీరజోదు, వంతలు దూరంనుంచే పాటపాడుతూ వస్తారు)

అమ్మా! మాయమ్మరావే!
కాళీ! మాయమ్మరావే!
మరిడమ్మ తల్లీ
తాళమ్మ తల్లీ
సల్లాని తల్లి రాయే
సల్లాని తల్లి రాయే – నీ
దీయెన్లు యిచ్చిపోయే ॥అమ్మా॥

ముడుపూలు కట్టించినాము తల్లీ
మొక్కులు చెల్లించినాము తల్లీ
జాతర్లు జరిపించినాము తల్లీ
ముడుపూలు కట్టంచి, మొక్కులు చెల్లించి
జాతర్లు జరిపించినామూ – ఓ తల్లీ –
మంచీ సెబ్బర సూసి కాసేటి మా తల్లీ ॥అమ్మా॥
పొర్లుదండాలు బెట్టించినాము
కోడిపెట్టల్ని కోయించినాము
ఏడపోతుల్ని బలియిచ్చినాము
దండాలు బెట్టించి, ఏటల్ని బలియిచ్చి
బోనాలు చేయించినాము – మా తల్లే –
ఆ రక్కసుడి మదమణిసి
రచ్చించు మా తల్లీ –
అమ్మా మాయమ్మరావె ॥

(అని అమ్మవారికి మొక్కి.....మరో పక్కకు వెళ్ళిపోతారు......

(లైట్లు ఆరి వెంటనే వెలుగుతాయి)

## ఆరోరంగం

(అర్ధరాత్రి......చంద్రుడు నడినెత్తిమీద ఉన్నాడు..వెన్నెల సర్వవ్యాప్తంగా ఉంది.....అడవి మధ్యలో ఒక కాలిబాట....కొంతదూరం పోయాక ఆ బాట అస్పష్టంగా వుంది....అక్కడికి వచ్చి ఆగాడు దొర – అదే, రాజా. తూలుతూ, అలిసి పోయివున్నాడు. గుడ్డలన్నీ మట్టి కొట్టుకు పోయాయి....చేవలు ఉడిగి వున్నాడు.

చుట్టూ చూస్తాడు..ఎక్కడ వున్నాడో తెలియదు..దూరంగా ఒక దిష్టి బొమ్మ, చెట్ల మధ్యలో...

నిస్పృహ ఆవహించింది అతన్ని.....వచ్చి ఒక మూల కూలబడతాడు, వగరుస్తూ)

**దొర/రాజా**

ఈ దూరం తరగదు..నేను ఏటి ఒడ్డుకు చేరను. ఎక్కడో దోవ తప్పినట్టున్నాను. ఈ సరికి ఎప్పుడో అడవి దాటి పోవలసిన వాణ్ణి..ఇంకా అడవి నట్టనడుమ ఉన్నట్టుగా ఉన్నాను....అబ్బా ఊపిరాడడం లేదు..

(అని తన కోటు, చొక్కా ఊడదీస్తాడు)

అమ్మయ్య! ఇప్పుడు కాస్త ఊపిరి అందుతోంది. ఇంకా ఈ కోటు, యీ దర్జా ఎందుకు? (చుట్టూ చూసి) ఎంత దూరం పరిగెత్తాను? (దూరంగా డప్పుల మోత వినిపిస్తుంది)

వీళ్ళు వస్తున్నంత తొందరగా నేను పరిగెత్తలేకపోతున్నానా? లేక, నేనెక్కడ ఉన్నానో తెలుసుకుని వాళ్ళు అడ్డదోవనే నాకు దగ్గరగా వస్తున్నారా? ఎప్పుడు విన్నా వాళ్ళు నాకు పరుగు దూరంలో ఉన్నట్టే అనిపిస్తోంది. తెల్లవారే లోపల వీళ్ళనుంచి తప్పించుకుని పారిపోవాలి..ఈ దోవ ఎక్కడికి వెడుతుందో? ఎన్నడూ చూసినట్లు లేదు! ఈ అడవిలో నాకు తెలియని చోటు లేదని విర్రవీగాను! ఇదంతా కొత్తగా కనిపిస్తోంది. పైగా ఈ వింత వింత ఆకారాలు కనిపించడ మేమిటి? ఇవి దయ్యాలా? భూతాలా?

(కాసేపాగి, నవ్వుకుని) దయ్యాలూ లేవు, భూతాలు లేవు. మన మనసుల్లో ఉన్న అనుమానమే ఇలా ఆకారాలుగా కనబడతాయట! మరి వాటి మాటలో? ఆ! అవీ మన ఊహల్లో నుంచి పుట్టినవే! ఒరే! చక్రవర్తీ!! నువ్వు – నువ్వు దయ్యాలున్నాయని అనుమానిస్తున్నావా? (నవ్వుతాడు)

(ఇంతలో దిష్టిబొమ్మ కదులుతుంది)

**దిష్టిబొమ్మ**

(ఉన్న చోటునుంచే) ఒరే రాజిగా! తీరిగ్గా కూర్చున్నట్టున్నావ్! ఒక్క ఆటవేద్దామా? (ఆ గొంతు బొంగురుగా వినిపిస్తుంది)

**రాజా**

(నిర్ఘాంతపోయి) ఎక్కడా గొంతు? ఎవరిది? అది అది వెంకటి గొంతు కదూ?

**దిష్టిబొమ్మ**

అవున్రా!......నేనే!...నువ్వు చేసిన సహాయానికి నిన్నెట్లా మరిచిపోగలనురా!

**రాజా**

మరి....మరి....అదేమిటి? ఆ వేషంలో –

**దిష్టిబొమ్మ**

అవున్రా...నువ్వు చేసిన దిష్టిబొమ్మను కదరా! జీవితంలో ఏం మిగిల్చావురా నాకు? అన్నీ.....అన్నీ దోచుకుపోయావు కదరా!

రాజా

వద్దు....ఆ పాత రోజులు జ్ఞాపకం చేయకు....నేను వినలేను...వెళ్ళాలి.....ఇక్కణ్ణుంచి వెంటనే వెళ్ళిపోవాలి.....

(అంటూ ఎడమవైపుకు పరిగెత్తబోతాడు. దిష్టిబొమ్మ రాజాకు ఎదురుగా నిలుస్తాడు)

దిష్టిబొమ్మ

(క్రూరంగా, నవ్వుతూ) ఆగరా, రాజిగా! బతికున్నంత కాలం నన్ను చంపావుగదూ! ఇప్పుడు నిన్ను చంపుతాను..నా ఆడదాన్ని ప్రేమించానని చెప్పి నా దగ్గరనుంచి లాక్కుపోయావ్! పోనీ దాన్ని సరిగ్గా చూశావా? నా డబ్బుతో దాన్ని కొన్నావ్! నన్ను సర్వనాశనం చేశావ్! దాని వయసుతో ఇంకా డబ్బు, కీర్తి కొనుక్కుందామనుకున్నావ్ కదూ! ఏదిరా?...ఏదిరా నా పెళ్ళాం? నా డబ్బేదిరా?....ఏదిరా? (అంటూ వలవల ఏడుస్తాడు)

నమ్మి చెడిన వాడు లేడు, నమ్మక చెడిపోతే పోతాడు – అన్నాను కదరా నీతో! అంతగా నమ్మాన్రా నిన్ను! నా తమ్ముడికంటె ఎక్కువగా చూసుకున్నాన్రా!..ఇప్పుడేమంటానో తెలుసా? తెలుసుకోకుండా నమ్మితే చెడిపోతావ్ నా కొడకా – అంటాను.

రాజా

(దిష్టిబొమ్మకు దూరంగా వెడుతూ) వెంకా! తప్పు చేశానురా! అయిపోయింది..నీకు తీరని అన్యాయం చేసినందుకు నాకు బాగా శిక్షపడుతోందిరా! ఇంకా ఇక్కడవుండి యీ అమానుషాలు చెయ్యలేను....నేను వెళ్ళాలి...

దిష్టిబొమ్మ

ఎక్కడికి వెడతావురా? నువ్వు గుడుగుడు గుంజం తిరుగుతూ ఇక్కడవే వున్నావురా! నీ పాత నేరాలకి, నీ అమానుషాలకి నీకు మాత్రం శిక్ష పడొద్దురా?

రాజా

లేదు...నేను వెళ్లాఇ..ఇప్పడే వెళ్ళాలి..వాళ్ళు తరుముకు వస్తున్నారు. నేనిక్కడ ఒక్క క్షణం ఉండగూడదు.

దిష్టిబొమ్మ

ఎవర్రా తరుముకొస్తున్నది? నీ పాపాలు నిన్ను తరుముతున్నాయిరా! ఎన్ని నీచమయిన పనులు చేసి నువ్వు చక్రవర్తి వయినా, నీకు నువ్వేరా మిగిలేది! నీ మంచి పనులేరా నిన్ను మనిషిగా నిలబెట్టేది!..

రాజా

అవున్రా....బుద్ధి గడ్డి తిన్నదన్నానుగా! నన్ను పోనీ! ఇంకా కొంచెం సేపు ఇక్కడే వుంటే వాళ్ళు నన్ను బలిపశువును చేసి అమ్మవారికి బలియిస్తారు....

దిష్టిబొమ్మ

వాళ్ళెవర్రా నిన్ను బలిఇవ్వడానికి? నేను లేనురా? నిన్ను రక్షిస్తాను. నా ప్రియాతి ప్రియమైన స్నేహితుడా? నిన్ను నా గుండెల్లో పెట్టుకుని రక్షిస్తాను.....రా.....నా చేతుల్లోకి రా...నీకూ నా రూపం ఇచ్చి, యీ అర్ధరాత్రి బతుకునిస్తాను. రారా....రాజిగా! రా.....

(వెంకడు మీది మీదికి వస్తాడు..రాజా నిజంగా భయపడ్డాడు)

**రాజా**

దగ్గరకు రాకు.....వెంకా...నా దగ్గరకు రాకు.....చెబుతున్నాను..విను..రాకు....ఒరే వెంకా! మరోసారి చావరా!

(అంటూ పిస్తోలు పేలుస్తాడు. దిష్టిబొమ్మ అక్కడే కింద పడిపోతుంది. భయం భయంగా రాజు దగ్గరకు వెళ్ళి చూస్తాడు. ఒఠ్ఠి దిష్టిబొమ్మ..రాజా చుట్టూ బిక్కు బిక్కు మంటూ చూస్తాడు. కాని ఇంతలో మనసు మార్చుకుని రెండో వైపుకు పరిగెత్తుతాడు.

## ఏడోరంగం

(కొండజాతి జనం – అరుచుకుంటూ – కేరింతలు కొడుతూ – తరుముకుంటూ వస్తారు)

**ఒకడు**

దొర అటుబోయిన చప్పుడు –

**రెండోవాడు**

ఆ దోవ ఎగవన మల్లీ ఈడనే కలుస్తదిరా –

**ముసలయ్య**

ఇదే దోవ ముందుకు నడవండిరా –

వీరజోదూ! అమ్మవారిని తలుచుకో –

**నాయకుడు**

ఆ దొరని తెల్లారే లోగా మట్టుబెట్టాలి... కొండకోనా, చెట్టు పుట్ట జాగ్రత్తగా వెతకండిరా –

**వీరజోదు**

అమ్మా! కాపాడుతల్లీ....ఆ దుర్మార్గుడి వైనం ఎరిగించు తల్లీ!.....

(అందరూ "అమ్మతల్లీ! రక్షించు" అంటూ రెండో వైపుకు వెడతారు)

## ఎనిమిదో రంగం

(రాత్రి రెండో జాము.....

వర్తులా కారంలో ఉన్న చదునైన ప్రదేశం...చుట్టూ ఎత్తుగా పెరిగిన చెట్లు.......మూలగా ఒకపెద్ద మాను...... దానికింద ఒక అరుగు. దానిమీద ఒక అమ్మాయి కూర్చుని ఉంది నల్లచీరెతో.....దీనమైన మొహం –

రాజా వస్తాడు..ఒక పాటు, బూట్లు తప్ప పైన ఆచ్ఛాదన ఏమీ లేదు....డస్సిపోయాడు....చుట్టూ చూస్తాడు. చీకట్లో వుండడం వల్ల ఆ అమ్మాయి కనిపించదు.

వగరుస్తూ.... ఆ ప్రదేశానికి వచ్చి మోకాళ్ళ మీద కూర్చుంటాడు. ఏడుపును ఆపుకుంటాడు...)

**రాజా**

(దీనంగా) భగవాన్!..భగవాన్! ఈ జీవితలో ఇంతవరకు నిన్నున తలుచుకోలేదు..నా తప్పులన్నీ క్షమించు.. చాలా ఘోరాలు చేశాను..స్వార్ధం నన్ను గుడ్డివాణ్ని చేసింది..నన్ను రక్షించు భగవాన్! ఈ నికృష్టమైన చావునుంచి

నన్ను రక్షించు.

(అని కూలబడతాడు..కాళ్ళకున్న బూట్లలో పరిగెత్తడం వల్ల కాళ్ళనొప్పులు ఓర్చుకోలేనంతగా ఉండడంతో ఆ బూట్లను విప్పి, కాళ్లను ఒత్తుకుంటూ, ఆ బూట్ల వంక చూస్తాడు.)

ఈ నగిషీ చేసిన మేలిరకం ముఖమల్ పాదరక్షలు రాజరికానికి చిహ్నం. రాజుగారికి లాగానే అవీ చంకి పాతవై అరిగిపోయాయి....అవి లేకుండా వుంటేనే పరిగెత్తడం సులువు.

(తీసి అవతల పారేస్తాడు)

(తన వంక చూసుకుని నవ్వుకుంటూ) ఇప్పుడు చూసుకో చక్రవర్తీ! ఒకప్పుడు నీ ఒంటి మీద ఉన్న చీనిచీనాంబరాలు..నీ దర్పం..నీ బలగం! ఏవరా ఇవన్నీ?

ఒరే! ఇన్నాళ్ళు నువ్వు బానిసలుగా చూసినవాళ్ళు ఇప్పుడు నిన్ను వేటాడుతున్నారు..దొరికితే నీ ప్రాణాలు నాలువునా తీస్తారు..నువ్వు ఆశగా, నా జీవిత సర్వస్వంగా దాచిపెట్టుకున్న బంగారం...యీ అడవిలోనే ఎక్కడో పాతిపెట్టి వుంది...అది దొరకదు.....నీకు తిండి లేదు.....బట్టలు జీర్ణం అయిపోయాయి....నువ్వు చక్రవర్తివిట్రా? దరిద్రదామోదర చక్రవర్తివిరా!

(చెట్టుకింద ఉన్న స్త్రీ మీద కాంతి కిరణం పడుతుంది)

**సీత**

నేను నీ పక్కనున్నంత వరకు నువ్వు చక్రవర్తివే, రాజా!

**రాజా**

ఎవరు? ఎవరిదా కంఠం? సీత.....సీత గొంతు కదూ?

**సీత**

అవును......నేనే!

**రాజా**

సీతా! నువ్వు! ఇక్కడ! ఇంతరాత్రి! ఇది కలా, నిజమా? (ఆమెను సమీపించబోతాడు..ఇంతలో అనుమానించి) నువ్వు కూడా .........ఇందాక కనిపించి భయపెట్టిన వాళ్ళలా –

**సీత**

(నవ్వి) ఛా! నేను నీ కోసమే వేచివున్న నీ సీతని..నాకు తెలుసు నువ్వు ఇక్కడికి వచ్చావని! పెద్ద చక్రవర్తివయ్యావని ..ఏనాటికైనా నన్ను చూడకపోతావా అని యీ అడవిలో వేచివున్నదాన్ని.

**రాజా**

సీతా! ఈ దీనుడి మీద యింత కనికరమా? నీకు నేను చాలా ద్రోహం చేశాను సీతా! ప్రేమించి నాతో వచ్చేసిన నిన్నున చాలా ఇబ్బందుల పాలు చేశాను.

**సీత**

నువ్వేం చేశావు రాజా? నీ అవసరం నీ చేత అలా చేయించింది..జరిగిందంతా మరిచిపో.....ఇప్పుడు నీ కోసం నేను, నా కోసం నువ్వు –

**రాజా**

(ఒక్క క్షణంలో మెరుపులాంటి ఆలోచన) సీతా! నా జీవితాన్ని మళ్ళీ మంచి మార్గాన పెట్టడానికి

దిగివచ్చిన దేవతవు నువ్వు..నువ్వు నా ముందు వుంటే ఈ కొండజాతి వెధవ్వందర్నీ ఒక ఆట ఆడించనూ?

సీత

అదేమిటీ? ఇక్కణ్ణుంచి పారిపోతున్నావు! వాళ్ళు నిన్ను చంపడానికి వస్తున్నారు..మళ్ళీ నన్ను ముందుంచుకుని వాళ్ళనో ఆట ఆడిస్తానంటావేమిటి?

రాజా

నువ్వు కనిపించే క్షణం వరకూ నా ఆట కట్టిందనే అనుకున్నాను. ఎలాగైనా ప్రాణాలతో బయట పడితే చాలనుకున్నాను. నువ్వు నాతోనే వుంటాననే చల్లని మాట చెప్పిన తరువాత – ఇక్కణ్ణుంచి పో బుద్ధి పుట్టడం లేదు…ఎందుకో తెలుసా?

సీత

చెప్పు.

రాజా

ఇక్కడే – ఈ అడవుల్లో – లక్షలు విలువచేసే బంగార నగలు పాతిపెట్టాను. …..ఎక్కడ పెట్టానో, ఎంత వెతికినా కనిపించలేదు.

సీత

(నవ్వి) నా కోసమేనా?

రాజా

(తబ్బిబ్బు పడి) ఆ……ఆ…నీకోసమే! బయటకు రాగానే ముందు నిన్ను కలిసి, ఆ నగలూ, బంగారం, అన్నీ నీకిచ్చి నీకు నేను చేసిన అన్యాయానికి క్షమాపణ అడగాలనుకున్నాను. మన అదృష్టం కొద్దీ యిక్కడ కలుసుకున్నాం…ఇక చూడు నువ్వు కొంచెం సాయం చేస్తే కనిపించని నగలు సంపాదిస్తాను. పోయిన అధికారాన్ని సంపాదించి యీ దొంగ వెధవల మీద ప్రతీకారం తీర్చుకుంటాను.

సీత

అదెలా?

రాజా

పిచ్చిదానా! నువ్వు కొంచెం తెలివిగా ప్రవర్తిస్తే, నువ్వే అమ్మవారివంటాను..వీళ్ళకు బుద్ధి చెప్పడానికి ప్రత్యక్షమైనా వంటాను. ఓ అవన్నీ నాకు వదిలి పెట్టు.

సీత

(విచారంగా నవ్వి) రాజిగా! అధికారం పోయింది. ఆస్తి పోయింది. గౌరవం పోయింది. ప్రాణం పోవడానికి సిద్దంగా ఉంది. అయినా నీ కుచ్చితం పోలేదు.

మాయమాటలు చెప్పి నన్ను నా భర్తకు కాకుండా చేశావు. మమ్మల్ని సర్వనాశనం చేశావు! ఇదంతా నా మీద ప్రేమ అనుకోని నీ వలలో పడ్డాను. నా సర్వస్వం నీదేనన్నాను..నన్నేం చేశావ్? నీ అధికార దాహానికి, నీ ధనాశకు నన్ను బలిచేశావు.

నన్ను ఎవరికో అమ్మేశావ్! ఆ డబ్బుతో పరారీ అయినావు! నీ కోసం అన్నీ వదులుకుని వచ్చాను. చివరకు నాకు ఏం మిగిల్చావ్? బజార్లో నిలబడి మానం అమ్ముకుని బ్రతకమని నన్ను ఒదిలేసి, ఇక్కడికి వచ్చి

చక్రవర్తివైనావ్!

మళ్ళీ అదే పాట పాడమంటున్నావు కదూ?

**రాజా**

సీతా! ఇప్పుడు నా ప్రాణాలు నీ చేతుల్లో ఉన్నాయి. నా మాట విను.

**సీత**

వింటాన్రా! నీతి లేని దొంగవెధవల మాటలు వినే ఇలా అయాను. నవ్వుతూ నిలబడ్డ రావణాసురుణ్ణి రాముడనుకున్నానురా. నువ్వు స్వయంగా చీరెలూవిచి నలుగురి ముందూ నిలబెట్టిన నీ ప్రేయసినిరా – నేను.

**రాజా**

సీతా!

**సీత**

అవున్రా! ఆ రోజున – నువ్వు నా వయసుని బజార్లో వేలం వేసిన రోజున – అప్పుడే చచ్చిపోయాన్రా! ఆ రోజు రాత్రే – (ఏడుస్తూ) ఈ మగజాతి క్రౌర్యానికి అంచెలంచెలుగా చావడం ఎందుకని ఒక్కసారే ఉరిపోసుకుని చచ్చిపోయాన్రా! నీ ప్రేయసిని, సీతనిరా –

**రాజా**

(తనలో అనుకుంటున్నట్టు) చచ్చిపోయావా?

(భయంతో కొంచెం వెనక్కు వెడతాడు)

**సీత**

(పెద్దగా) ఒరేయ్ రాజిగా! (రాజా వైపుకు నడుస్తూ) నువ్వు నేనంటే చూపించిన ప్రేమకు బదులు ఇవ్వడానికి వచ్చానురా! నిన్ను చల్లని కౌగిట్లో బంధించి పెనవేసుకుపోవాలని వచ్చానురా! ప్రతీకార జ్వాలతో ఉడుకెత్తిపోయిన నా రక్తాన్ని చల్లబడిపోయిన నా శరీరం అణచలేకపోతోందిరా! రా! నీ కోసమే కాచుకు క్కూర్చున్నాను....రా....ఒకనాటి నా ప్రియుడా!.....రా –

**రాజా**

(భయపడుతూ) సీతా! వద్దు.....దగ్గరకు రాకు...విను....నా దగ్గరకు రాకు...వెళ్ళు.....వెళ్ళు – (గట్టిగా అరుస్తాడు)

(సీత 'రా..రా' అంటూ ముందుకీ 'వెళ్ళు రావద్దు' అంటూ రాజా..రాజా గట్టిగా అరుస్తూ పిస్తోలు తీస్తాడు. పేలుస్తాడు... పేల్చిన చోట మంట మాత్రమే కనిపిస్తుంది..దూంగా స్త్రీ ఆక్రందన. రాజా ఒక్కడే గాఢాంధకారంలో మిగులుతాడు..డప్పుల మోత దగ్గరగా వినిపిస్తుంది..రాజా చుట్టూ చూస్తూ తన చుట్టూ తాను తిరుగుతాడు...పెద్ద పెట్టున గాలి వీచిన చప్పుడు..మెరుపులు. రాజాకు మతిపోయింది.)

**రాజా**

అమ్మా!......(అంటూ పరిగెత్తుకు పోతాడు)

## తొమ్మిదో రంగం

(తెల్లవారుఝామున 4 గంటలు..వెనక ఉధృతనృత్యం..కొలుపులు..దానికి దీటుగా తప్పెటల లయ..దానికి

తగిన లయ.)

మునలయ్య

అమ్మా! కొండదేవరా!.....తెల్లవారేలోగా ఆ దుష్టుణ్ణి తెచ్చి నీకు అప్పజెబుతాం తల్లీ! ఆ నెత్తురు తాగిన నరపశువు ఎక్కడున్నాడో సెలవియ్యి తల్లీ.....వీరజోదూ! అమ్మోరి దీవెనలు కావాల....కొలుపులు చెయ్యి......

వీరజోదు, వంతలు

కాళి మాంకాళి మాయమ్మ – ఓ జగన్మాత
నిను భక్తితోడ ప్రార్థించెద మాయమ్మ ॥కాళి॥
ఆదికి మొదలగు ఓంకారంబుల
ఆది శక్తివై పిండాండంబుల
ముగ్గురు మూర్తుల సృష్టిజేసిన
మూలము తెలిసిన లోకమాతయె ॥కాళి॥
దుష్ట రక్కసుల ద్రుంచులకొరకై
భీమ పరాక్రమ భీకర రూపిణి
అష్టవీర సంహారిణి వైతివి
అవని యంతకు రక్షకూర్చితివి ॥కాళి॥
మహాకాళి అరివీర భయంకరి
మహిషాసురుని మర్దని నమ్మ
ధరణి రక్కసుల మదమణగించి
ఎల్ల లోకముల బ్రోవగదమ్మ ॥కాళి॥
కదన రంగములన యోధుల గుండెలు
గుభిలు గుభిలుమని కుందు చెందగ
వైరి మూకల ఖండ ఖండముల
నుగ్గు చేసిన శక్తి రూపిణివి ॥కాళి॥

(పాట మధ్యలోనే ఓ పూజారి చింతబరికె, వేపమండ తీసుకుని అమ్మవారికి నారు పోస్తాడు.పూనకం వచ్చినవాళ్ళు అమ్మా, కాళీ – అంటూ అరుస్తూ వుంటారు....అయిపోగానే)

మునలయ్య

అమ్మా! కొండదేవరా! కాళికామ్మతల్లీ!! ఈ పున్నమి రేతిరి గడిచేలోగా ఆ దుర్మార్గుణ్ణి తెచ్చి బలి సమర్పించుకుంటాం తల్లీ.....రక్షించమ్మా.........పదండిరా....నాలుగుదిక్కులా వెతకండి.......మనల్ని తప్పించుకుని ఎక్కడకు వెడతాడు దొర?...

(అందరూ బయలు దేరుతారు....వేగంగా డప్పు మోత)

## పదోరంగం

(ఒక గుడి.....ఎత్తయిన పీఠం.....అమ్మవారి విగ్రహం రాజా పరుగు పరుగున వచ్చాడు)

రాజా

అమ్మా! రక్షించు తల్లీ!....కాళీమాతా!.....రక్షించు.....ఈ కసాయి వాళ్ళ చేతుల్లోంచి రక్షించు.....

(గుడిలోపల్నుంచి ఓ ముసలావిడ వస్తుంది. పెద్దబొట్టు..అమ్మవారిలా వుంది)

ముసలావిడ

(వస్తూ) ఎవరు?

రాజా

ఎవరు? అమ్మవారు??

ముసలావిడ

నేను అమ్మవారిని కాదు నాయనా! మామూలు మనిషినే!..నువ్వేదో ఆపదలో ఉన్నట్టున్నావు!

రాజా

నువ్వు......నువ్వు......

ముసలావిడ

ముసల్దాన్ని......పారేసిన విస్తరాకులా ఎక్కడెక్కడో ఎగిరెగిరి ఇక్కడకు వచ్చి తలదాచుకున్నాను..ఎవరు నాయనా నువ్వు? ఏం కావాలి?

రాజా

అమ్మా.....నేనమ్మా!

ముసలావిడ

ఎవర్ని నాయనా నువ్వు పిలిచేది?

రాజా

నిన్నేనమ్మా! నేను.....రాజానమ్మా......నీ కొడుకుని.....

ముసలావిడ

పిచ్చివాడిలా వున్నావు! పాపం! మీ అమ్మ జ్ఞాపకం వచ్చిందేమో?

రాజా

అమ్మా! నేనమ్మా! రాజాని......నన్ను గుర్తు పట్టలేదా?

ముసలావిడ

లేదు బాబూ! నాకా అదృష్టం లేదు....నీ అంతటి మంచి వాణ్ణి అమ్మవారంటే ఇంత భక్తి ఉన్నవాణ్ణి కొడుగ్గా పొందే అదృష్టం నాకు లేదు నాయనా!

మాకూ ఓ కొడుకు ఉండేవాడు. ఒక్కడే! అల్లారు ముద్దుగా పెంచాం.....వాడు కావాలి అనకముందే అంగలార్చుకుంటూ అన్నీ తెచ్చిపెట్టేవాళ్ళం....వాడు "బూరా" కావాలన్నాడు..ఇచ్చాం...సైకిలన్నాడు.....అలానే ఇచ్చాం......స్నేహితుల కోసం డబ్బులన్నాడు..వేదన లేకుండా ఇచ్చాం. తనకు తన ఆర్భాటానికి ఆస్తంతా కావాలన్నాడు. తీసుకోనాయనా అన్నాం....మీరు యింట్లోనే ఉంటే నా ఆటలు సాగవు, వెళ్ళండి – అన్నాడు. 'అంతకంటే నా' అన్నాం....దేశాలు తిరిగాం...బిచ్చమెత్తుకున్నాం.

రాజా

అమ్మా!

ముసలావిడ

బాబూ! మా కొడుకులాంటి కొడుకు మరెవ్వరికీ ఉండడు......ఇప్పుడెక్కడో గొప్పవాడై రాజ్యాలేలుతూ ఉండాలి.

రాజా

ఆ దుర్మార్గుణ్ణి నేనేనమ్మా! నీ రాజాని....ఇంకా గుర్తు పట్టలేదా?

ముసలావిడ

నువ్వేనట్రా నాయనా! స్నేహితుల కోసం తల్లిదండ్రుల్ని ఆడదాని కోసం స్నేహితుల్ని, డబ్బు కోసం, అధికారం కోసం నిన్ను నమ్మిన అందర్నీ అమ్మిన నా చిన్నారి కొడుకువు నువ్వేనా నాయనా! పెద్దతనం కాదూ! సరిగ్గా కనిపించదు.

రాజా

అమ్మా! వెనకనుంచి కొండజాతివాళ్ళు తరుముకు వస్తున్నారు..వాళ్ళు పరమ దుర్మార్గులమ్మా! నన్ను వాళ్ళు అమ్మవారికి బలి యిస్తారు. నన్ను కాపాడు..ఎక్కడైనా దాచిపెట్టు.....నీ కొడుకు చేసిన తప్పుల్ని నువ్వఇనా క్షమించమ్మా!

ముసలావిడ

నువ్వేం తప్పులు చేశావు నాయానా? తప్పులన్నీ మావే! నీవింతటి వాడవవుతావని నీ చిన్నప్పుడే కనుక్కోలేకపోవడం మా తప్పు......ఇప్పుడు చూడు....డబ్బు సంపాదించావట! దొరవైనావుట! నీ యిష్టానుసారం రాజ్యం చేశావుట! ఇంతకంటే ఏం కావాలి నాయనా?

రాజా

ఆ తప్పులన్నీ ఎన్నడం ఇప్పుడా అమ్మా! వద్దమ్మా వద్దు....ఇప్పుడు నీ కొడుకు ఆపదలో ఉన్నాడమ్మా! వెనకనుంచి మృత్యువు తరుముకు వస్తోంది.....నీ కొడుకును నువ్వు రక్షించాలమ్మా! (కాళ్ళ దగ్గర కూలబడతాడు)

ముసలావిడ

(లేచి దూరంగా వెడుతూ) నువ్వు నా కొడుకువి కాదురా! మేం చేసుకున్న పాపాలకి ప్రతిరూపానివి, ధనం, అధికారం, దర్పం, దర్జా – ఏవిరా నువ్వు కోరుకున్నవన్నీ? మంచి వాళ్ళని వంచించి నువ్వు పొందిన సార్వభౌమ పదవి ఏదిరా?

రాజా

అన్నీ....అన్నీ అదృశ్యం అయిపోయాయి...మంచులా కరిగిపోయాయి.....ఇప్పుడు ......ఇప్పుడు నేను ఒట్టి రాజానే....నువ్వే ఎలాగైనా కాపాడాలమ్మా!

ముసలావిడ

'అమ్మా' అని పిలవకురా. కొడుకు ఎంత చెడ్డవాడైనా 'అమ్మా' అని పిలిస్తే తల్లి కరిగిపోతుంది. పేగుల్లో నుంచి ప్రేమ పొంగుకొస్తుంది......కాని.......కాని నిన్ను తలుచుకున్నా, నీ ధేష్ట్యాల్ని ఊహించుకున్నా – నీ మీద అసహ్య ఇంకా ఇంకా ఎక్కువౌతోంది.

ఇంకా ఇంకా ధనం

ఇంకా ఇంకా అధికారం..పదవి...గొప్పతనం –

దానికోసం వంచనలూ, దోపిడీలు

హత్యలూ, నరమేధ యాగాలు

ఒరే! శాశ్వతమైన ప్రేమానుబంధాల్ని నీ స్వార్థం కోసం బలిపెట్టిన కొడుకా! నిన్ను ఏ తల్లీ క్షమించదురా!! నువ్వు ఇప్పుడు రక్షించబడితే ఎందరు తల్లులు తల్లడిల్లిపోతారో!..నువ్వు బతకడానికి వీలు లేదు....నిన్ను అమ్మవారికి నేనే బలిఇస్తాను.

రాజా

అమ్మా! తల్లివని బతిమాలాను. నన్ను రక్షిస్తావని ఆశపడ్డాను. అమ్మవారికి బలి ఇవ్వబోతున్న నన్ను కాపాడతావనుకున్నాను.

ముసలావిడ

సరే! కాపాడతాను....బతికిన రోజుల్లో నువ్వు కొడుకువన్న దౌర్బల్యంతో – కాపాడతాను. అయితే నేను చెప్పింది చేస్తావా?

రాజా

(ఆశగా) చెప్పమ్మా! తప్పకుండా చేస్తాను.

ముసలావిడ

నీ పిస్తోలులో వెండి గుండు ఉంది గదూ!

రాజా

(నిర్ఘాంతపోతాడు) ఉంది...కాని.....కాని నీకెలా తెలుసు?

ముసలావిడ

ఒరే! నాకు అన్నీ తెలుసు.....ఆ గుండు ఎందుకు? ఎవరికోసం? (మాట్లడడు) (గట్టిగా) చెప్పు.

రాజా

నా కోసమే!...నా చివరి క్షణాల్లో – మరో గత్యంతరం లేకపోతే నన్ను నేనే కాల్చుకుని చచ్చిపోవాలని–

ముసలావిడ

ఆ! ఇప్పుడాసమయం వచ్చింది.....ఆ వెండి గుండుతో నిన్ను నువ్వే అమ్మవారికి ఆత్మార్పణ చేసుకో–

రాజా

అమ్మా! ఇదా నువ్వు చెప్పేది!....నేను చావను....నేను బతకాలి....ఆ పని నేను చేయలేను.

ముసలావిడ

అయితే, నేనే నిన్ను అమ్మవారికి బలి ఇస్తానురా......ఇప్పుడే.....ఇక్కడే.........(రాజా వైపు నడుస్తుంది)

రాజా

అమ్మా! నువ్వూ వాళ్ళలాంటి దానివేనా?

(ముసలావిడ బిగ్గరగా నవ్వి యింకా ముందుకు పోతుంది)

రాకు....నా దగ్గరకు రాకు....నా చేతిలో పిస్తోలు వుంది......ఈ వెండి గుండుతో నిన్ను కాలుస్తాను...రాకు... దగ్గరకు రాకు.

**ముసలావిడ**

నాకు తెలుసురా! నువ్వు కన్నతల్లిని కూడా చంపగలవాడివేరా!......నాకు తెలుసు...ఇది వరకే చచ్చిపోయిన తల్లిని మళ్ళీ చంపుతావురా! నీ వెండిగుండుతో చంపు.......చంపరా, చంపు.

**రాజా**

అమ్మా.........(అంటూ పేలుస్తాడు.....చుట్టూ ఉరుములు, మెరుపులు)

(ఎక్కణ్ణుంచో వినిపిస్తున్నట్లుగా)

"దుర్మార్గుణ్ణి, అధికారమదాంధుణ్ణి, నాయకుడు కావడం కోసం నమ్మిన వాళ్ళను బలి యిచ్చిన వాణ్ణి నా కొడుకైనా సరే – వాడిని, అమ్మవారికి బలియిస్తాను....బలియిస్తాను....రా.....రా....."

(ఉధృతంగా డప్పుల చప్పుడు)

## పదకొండో రంగం

తెల్లవారుతూ వుంది......ప్రకృతి అంతి నిద్రమేల్కొంటూ వుంది..కర్మసాక్షి తొలి ప్రభాత కిరణాలు పుడమితల్లిని నిద్రలేపుతున్నాయి.....మొదటి రంగం జరిగిన ప్రదేశానికి దగ్గరలో – వెనక దొరగారి సౌధం తాలూకూ స్తంభాలు కనిపిస్తూ వుంటాయి. కొండ జనం కొలుపులు చేస్తూనే ప్రవేశిస్తారు....నలుగురైదుగురు కొండవాళ్ళ చేతల్లో వెండి గుళ్ళు ఉన్నాయి...అందరూ వెండి తొడుగులున్న బళ్ళాలు పుచ్చుకున్నారు. నాయకుడు – ఈరన్న – చేతులో బల్లెం – మరో చేతిలో రివాల్వరు.....అతని వెంట షావుకారు...స్టేజి మధ్యకు రాగానే 'ఆగండి' అన్నట్లు సంజ్ఞ చేస్తాడు నాయకుడు. అందరూ ఠక్కున ఆగారు.

**షావుకారు**

(చుట్టూ చూసి) నే చెప్పలా వాడు పారిపోతాడని..జిత్తులమారి..ఏ మాత్రం సందు దొరికినా పారిపోతాడని నేను మొత్తుకుంటూనే వున్నా.....తొందరగా నడవండిరా అంటే వింటేనా? జాతర, కొలుపులు అంటూ రాత్రంతా చెవులు తూట్లు పడేడట్లు తప్పెట్లు..పారిపోతాడంటే పోడూ –

**ఈరన్న**

అమ్మోరి ఆన....ఆ దొరని పట్టుకు తీరతాం.

**షావుకారు**

ఏం పట్టుకుంటావ్? ఆయనీ సరికి ఏరుదాటి పోకుండా వుంటే గదా?

**ఈరన్న**

ఏడకీ పోడు....సత్తెమున్న కొండదేవర ఆన....ఆ దొరని పట్టకతీరతాం –

**షావుకారు**

ఆ! పట్టుకోవాలి!..మీరంతా కలిసినా ఆయన కాలిగోరుకు సరిపోరు...ఆయనంటే నాకు బద్ధవిరోధం! అయినా ఆయన్ని గురించి యీ మాట మాత్రం చెప్పకుండా ఉండలేను..ఆయన దమ్ములున్న మనిషి..

**ఈరన్న**

ఉష్!....ఆగండి.....వస్తున్నది..మనిషి కాళ్ళతో బెబ్బులి.....పొంచి వుండండిరా....(డప్పులని ఆగమని సంజ్ఞ చేస్తాడు)

షావుకారు

(రహస్యంగా) ఎవరు? దొరేనంటావా?

ఈరన్న

అరవకయ్యా సావుకారూ! అల్లంత దూరాన బొటన వేలు నేలతాకితే అది జివ్వుమని నా చెవికి సోకుతాది....దొరే వస్తుండు....మీరంతా దాక్కుని ఒక్క ఉదటను పట్టండిరా....

(అందరూ పక్కలకి తప్పుకుంటారు...అంతా నిశ్శబ్దం..రాజా వస్తాడు.....బిత్తర చూపులు చూసుకుంటూ)

రాజా

(భయభ్రాంతుడై) ఏమిటి ఈ భయంకరమైన నిశ్శబ్దం? తప్పెట మోగితేనే బావుంది....కనీసం వాళ్లెక్కడ వున్నారో తెలిసేది....నేనెక్కడ వున్నాను?.....ఎక్కడ?

(అకస్మాత్తుగా డప్పుల మోత....ఉధృతంగా.......కొండ జనం హాహాకారాలు.....'పట్టండిరా, పట్టండిరా' అంటూ రాజా రెండో వైపు పరుగెత్తుతాడు.....వాళ్ళ అరుపులు ఇంకా కొంచెం దూరంలోనే ఉన్నాయి. ఇప్పుడు రాజాకి ఎదురుగా ఇదివరకు కనిపించిన వివిధ ఆకారాలు ఎదురౌతాయి)

ఆకారాలు

మమ్మల్ని – నిన్నే దేవుడని కొలిసేటోళ్ళని – బంగారం కోసం, నగల కోసం, జాలి అంటూ లేకుండా చంపించిన దొరా – నిన్ను అమ్మోరికి బలిఇస్తాం –

(రాజా మరోవైపుకు పరిగెత్తుతాడు)

జైలర్

నా విధిని కూడా కాదని నిన్ను ఆదరంగా చూస్తే నన్నే చంపావు కదూ! నిన్ను యిపుడే అమ్మోరికి బలి ఇస్తా.

వెంకడు

నువ్వు గొప్పోడివి కావడం కోసం నమ్మిన స్నేహితుణ్ణే మట్టుపెట్టిన మోసగాడివి.....నిన్ను అమ్మోరికి బలి ఇవ్వక తప్పదు...

సీత

ప్రేమను బజార్లో పెట్టి అమ్మే రాక్షసుడా! నువ్వు చావాల్సిందే!

ముసలావిడ

దుర్మార్గుణ్ణి....అధికార మందాంధుణ్ణి...నాయకుడు కావడం కోసం నమ్మిన వాళ్ళను బలి ఇచ్చే వాణ్ణి – నా కొడుకైనా సరే – వాణ్ణి అమ్మవారికి బలి ఇస్తాను

(ఇవి అన్నీ శాబ్దికమైన హెచ్చరికలే...ఇవి జరుగుతూ వున్నప్పుడు రాజా రంగంమీద ఒక పక్కనుంచి మరో వైపుకు పరిగెత్తుతూ ఉంటాడు. వీటి చివర –)

ఈరన్న

పట్టండిరా – దొరని......పట్టండి......

(నాలుగు వైపుల నుంచి జనం వస్తారు..రాజా కిందపడిపోతాడు.....రంగం మధ్యలో)

**రాజా**

నన్ను.....నన్ను చంపకండి....మీకు పుణ్యం ఉంటుంది......

**ఆకారాలు అన్నీ కలిసి**

చంపకపోతే పాపం...వీణ్ణి బ్రతకనిస్తేనే అందరికీ శాపం....

(ఈ మాటలతో అందరూ ఉధృతమైన నృత్యం ప్రారంభిస్తారు, పడిపోయిన రాజా చుట్టూ)

**ఈరన్న**

దొరా! ఇయ్యాల్టితో నా సావు మూడింది.

(షావుకారు ఉధృతంగా నవ్వుతాడు)

**ఈరన్న**

దొరా! సింవానివని సింవాసనం మీద కూసో బెడితే – నక్కలా మా మీద కుతంత్రం చేసివావు! పులిలా మారకతం తాగినావు!! చచ్చిన కళేబరాల్ని తినే డేగలా మా ఒళ్ళంతా గుచ్చి గుచ్చి తిన్నావ్!

అందుకే దొరా! నీ కోసం ఎండి గుళ్ళు చేయించినం! నీతాన ఒక్కటే వుంది గదూ! నాతాన ఆరూ ఎండి గుళ్ళే (అని పిస్తోలు తీస్తాడు)

**అందరూ**

ఆరూ ఎండిగుళ్ళే!

**ఈరన్న**

అంతేనా? మా ఆడోళ్ళు ప్రతి చిన్నం ఎండీ నిన్ను సంపేందుకు అమ్మోరికి కానుకలిచ్చింద్రు –

**అందరూ**

అవును....అమ్మోరికి కానుకలిచ్చినం...

**ఈరన్న**

దాంతో పది పేద్ధ ఎండి గుళ్ళు చేయించినా....మా బల్లాలకి ఎండి తొడుగులు చేయించినం.....

**అందరు**

అవును మా బల్లాలకి ఎండి తొడగులు చేయించినం –

**ఈరన్న**

(దగ్గరగా వచ్చి) ఒడుగోళ్లని, నమ్మినోళ్ళని, దేవుడని కొలిసేటోళ్ళని చంపుకుతిన్న దొరా! ఇయ్యాల్టితో నీ సావు మూడింది.....

**అందరూ**

ఇయ్యాలతో నీ సావు మూడింది.....

(అందరూ బల్లాలు పైకెత్తి రాజా మీదకు రావడంతో లైట్లు మెల్లమెల్లగా మందగిస్తాయి)

(వాళ్ళు వెనక అలా ఫ్రీజ్ అయివుండగానే – తెల్లవారింది....వీరజోదు, వంతలు ముందుకు వస్తారు)

## ఉత్తర రంగం

### వీరజోదు, వంతలు

ఈ ఇదంగా – మంచి చేసినోళ్లని చెరుపుజేసి – దేవుడని కొలిసినోళ్ళని దయ్యమై పట్టుకు తినేటోళ్ళందరూ ఎట్ట మట్ట కరిసింఙ్రో – ఇయ్యాల దొరకి గూడ అదే గతి పట్టింది.

ఆయన చేసిన ఎదవ పనులే ఆయన్ని ఎంటాడి ఎంటాడి చంపినై –

మనుషులను పీడించే అధికార ధనమదాంధులకు ఇదే ముగింపు – ఆ మాటలు జ్ఞాపకం పెట్టుకోండని మనవి చేస్తున్నాను –

పోయివచ్చెద మయ్యలారా భళిభళి
పోయవచ్చెద మమ్మలారా భళిభళి
పోయి వత్తుము పెద్దలారా భళిభళి
మళ్ళీ తిరిగొస్తాము, మా మాటను మీరు
మరువద్దని మీకు వందనములు ॥
దొరలెప్పుడొచ్చినా భళిభళి
సొంత లాభం కొరకు ॥
నిన్ను నన్నూ కొట్టి ॥
రాజ్యాలు ఏలితే ॥
హెచ్చరిక కోసమై ॥
మళ్ళీ తిరిగొస్తాము మా మాటలను మీరు
మరువవద్దని మీకు వందనములు

(అయిపోయింది)